1వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తిగా సత్యవతి

ముగ్గురు సీనియర్ సివిల్ జడ్జిలకు పదోన్నతి

గుంటూరు లీగల్, న్యూస్‌టుడే: గుంటూరు 1వ అదనపు జిల్లా కోర్టు జడ్జిగా వి.ఎ.ఎల్.సత్యవతి నియమితులయ్యారు. రెండో అదనపు జిల్లా కోర్టు జడ్జిగా విధులు నిర్వహిస్తున్న ఆమెను ఖాళీగా ఉన్న 1వ అదనపు జిల్లా కోర్టు జడ్జిగా నియమిస్తూ హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ముగ్గురు సీనియర్ సివిల్ జడ్జిలను పదోన్నతిపై అదనపు జిల్లా జడ్జిలుగా గుంటూరులో నియమించారు. మంగళగిరిలో సీనియర్ సివిల్ కోర్టు జడ్జిగా పనిచేస్తున్న వై. నాగరాజుకు రెండో అదనపు జిల్లా కోర్టు జడ్జిగా, సత్తెనపల్లిలో సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న సి.హెచ్.వెంకట నాగశ్రీనివాసరావుకు మూడో అదనపు జిల్లా కోర్టు జడ్జిగా, గుంటూరులో సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎ.అనితకు గుంటూరు పోక్సో కోర్టు జడ్జిగా పదోన్నతి కల్పించారు. నందికొట్కూరులో సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఎం.ఇందిరా ప్రియదర్శిని తెనాలి పోక్సో కోర్టు జడ్జిగా నియమిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

మిర్చియార్డు ప్రక్షాళన దిశగా చర్యలు

పర్సన్ ఇన్‌ఛార్జిగా సంయుక్త కలెక్టర్ భార్గవతేజ

ప్రభుత్వ ఉత్తర్వులు జారీ


భార్గవ తేజ, సంయుక్త కలెక్టర్


ఆంజనేయులు, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ

మిర్చియార్డు, న్యూస్‌టుడే: గత అయిదేళ్ల వైకాపా హయాంలో గుంటూరు మిర్చియార్డులో జరిగిన అక్రమాలు, అవకతవకలపై ప్రస్తుతం విజిలెన్స్ విచారణ సాగుతోంది. ఇది ముగియగానే మార్కెటింగ్ శాఖ విచారణ ప్రారంభం కానుంది. విజిలెన్స్ ఎస్పీ సూర్య శ్రావణ్‌కుమార్ మిర్చియార్డులో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి క్రయవిక్రయాలపై ఆరా తీశారు. ఇదిలా ఉంటే మిర్చియార్డులో అక్రమాలకు అడ్డుకట్ట వేసి ప్రక్షాళన చేసే చర్యల్లో భాగంగా సంయుక్త కలెక్టర్ భార్గవ తేజను పర్సన్ ఇన్‌ఛార్జిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు పర్సన్ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు నిర్వర్తించారు. మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు విచారణ నిమిత్తం నియమించిన గ్రూపు సభ్యుల్లో శ్రీనివాసరావు కూడా ఉన్నారు. విచారణాధికారిగా ఉన్నందున తనను మిర్చియార్డు పర్సన్ ఇన్‌ఛార్జి బాధ్యతల నుంచి తప్పించాలని కోరారు. ఆయన స్థానంలో సంయుక్త కలెక్టర్ భార్గవ తేజ త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నారు.

గతంలో ఈనామ్ పకడ్బందీగా అమలు

గతంలో జాయింట్ కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పర్సన్ ఇన్‌ఛార్జిగా ఉన్నప్పుడు ఈ-నామ్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లతో తూకాలు వేయించడం, బూమ్ బారియర్ల ఏర్పాటు, వేమెన్లు తూకాల సమయంలో అప్రమత్తంగా వ్యవహరించడం, ఏజెంట్లు అధిక కమీషన్ వసూలు చేయకుండా చర్యలు తీసుకోవడంతో పాటు జీరో వ్యాపారానికి అడ్డుకట్ట వేయగలిగారు. వీటిని తర్వాత వచ్చిన పాలకవర్గాలు కొనసాగించి ఉంటే.. గత అయిదేళ్లలో అక్రమాలు, అవకతవకలకు ఆస్కారం ఉండేది కాదు.

కార్యదర్శిగా ఆంజనేయులు

మిర్చియార్డు కార్యదర్శిగా ఆంజనేయులును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డిని మార్కెటింగ్ శాఖ ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించింది. ఆంజనేయులు ప్రస్తుతం రాజమహేంద్రవరం మార్కెట్ యార్డు కార్యదర్శిగా ఉన్నారు. 1985లో టైపిస్టుగా ఆయన మార్కెటింగ్ శాఖలో చేరారు.

సంక్షేమ హాస్టళ్లు.. నరకానికి నకళ్లు..


ఏటీ అగ్రహారం 13వ లైన్‌లోని బాలుర హాస్టల్‌లో దుప్పట్లు లేకుండానే నిద్రపోతున్న విద్యార్థులు


తెనాలి: ఆర్‌ఆర్‌నగరంలో ఎస్సీ బాలికల హాస్టల్ చుట్టూ పాతరేకులు అడ్డు కట్టారిలా...

- గత వైకాపా హయాంలో నిర్వహణ లేమి
- అరకొర వసతుల మధ్య విద్యార్థుల అవస్థలు
- కూటమి ప్రభుత్వం వచ్చాకే దిద్దుబాటు చర్యలు

రంగులు వెలసిన గోడలు...
ఊడిపోయిన కిటికీలు... తలుపుల్లేని మరుగుదొడ్లు...
ఇరుకిరుకు గదులు... అలంకారప్రాయంగా కుళాయిలు..
అరకొరగా తాగునీరు... సరిపోని ఫ్యాన్లు... అపరిశుభ్ర వాతావరణం...

ఇదీ సంక్షేమ వసతి గృహాల పరిస్థితి. విద్యార్థులకు చుక్కలు చూపిస్తూ.. నరకానికి ఆనవాళ్లుగా దర్శనమిస్తున్నాయి. వీటి నిర్వహణను గత వైకాపా ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసింది. ప్రైవేటు గృహాలకు అద్దెలు కట్టలేదు. కాస్మొటిక్ ఛార్జీలకూ ఎగనామం పెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక బడ్జెట్ విడుదల చేయడంతో కొంత ఊరట లభించింది. సాంఘిక సంక్షేమం, వెనుకబడిన తరగతులు, గిరిజన సంక్షేమశాఖల్లో ఏ వసతిగృహాన్ని చూసినా.. అవస్థలు కళ్లకు కడతాయి. హాస్టళ్ల విద్యార్థులకు దుప్పట్ల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, చలికి ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు చేయాలని హెచ్‌డబ్ల్యూవోలకు సూచించామని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు డి.మధుసూదన్‌రావు తెలిపారు.

- ప్రైవేటు భవనాల్లో నడుస్తున్న వసతిగృహాలకు నాలుగు నెలలకుపైగా అద్దెలు, ఆహార బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం రాగానే జులైలో కొంతమేర నిధులిచ్చింది. వీటితో అధికారులు అంతకుముందున్న బకాయిలు చెల్లించారు.
- ఫుడ్ బిల్లుల బకాయిల వల్ల నిత్యావసరాలకు ఇబ్బంది పడుతున్నామని వసతిగృహాల సంరక్షణాధికారులు తెలిపారు.
- ఈ ఏడాది జనవరి నుంచి బీసీ విద్యార్థులకు, ఏప్రిల్ నుంచి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కాస్మొటిక్స్ ఛార్జీలు విడుదల చేయలేదు. విద్యార్థులు తలకు కొబ్బరి నూనె పెట్టుకోవాలన్నా ఇబ్బందిగా ఉందని ఆవేదన చెందుతున్నారు.
- రెండేళ్లకోసారి విద్యార్థులకు ప్లేటు, గ్లాసు, ట్రంకు పెట్టెలిస్తారు. ఇవి చాలాచోట్ల పాడైపోయాయి. మరికొన్ని హాస్టళ్లలో పిల్లలకు ట్రంకుపెట్టెలు ఇవ్వలేదు.
- గత నెలలో నాగార్జున విశ్వవిద్యాలయంలో సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి కార్యశాల ఏర్పాటు చేసి సమస్యలపై చర్చించారు. వివిధ మరమ్మతులకు, విద్యుత్తు సమస్యల పరిష్కారానికి చేతిలో చిల్లిగవ్వ లేదని వార్డెన్లు చెబుతున్నారు. చాలాచోట్ల లైట్లు అరకొరగానే వెలుగుతున్నాయని తెలిపారు.



ఇది వసతిగృహమట!

ఇంజినీరింగ్, డిగ్రీ, డిప్లమో విద్యార్థులు 33 మంది కోసం చేబ్రోలులో ఏర్పాటు చేసిన హాస్టల్ ఇది. రేకుల కప్పు, ఓ పక్క రేకులు, చిన్న గోడలు, వాటికి గ్రిల్స్‌తో ఉన్న వరండాలో 25 మంది ఉంటున్నారు. పేరుకు 8 మరుగుదొడ్లు ఉన్నా.. నాలుగింటికి తలుపులు సరిగా లేవు. మిగిలినవాటినే వాడుకోవాల్సిన పరిస్థితి.

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - తెనాలి(కొత్తపేట), చేబ్రోలు, పొన్నూరు, పట్టాభిపురం, నెహ్రూనగర్, ఏటీ అగ్రహారం, బ్రాడీపేట (గుంటూరు)

●● తెనాలి మండల, పట్టణ పరిధిలోని 6 ఎస్సీ, 4 బీసీ హాస్టళ్లలో మరుగుదొడ్ల తలుపులు ఊడిపోయి అపరిశుభ్రంగా ఉన్నాయి. కొంతమందికే దుప్పట్లు, కంచాలు, గ్లాసులు ఇచ్చారు. ఆరు నెలలుగా మెస్, కాస్మొటిక్స్ ఛార్జీలు, భవనాల అద్దె చెల్లించట్లేదు.

●● పొన్నూరు 19వ వార్డులోని హాస్టల్‌కు గత వైకాపా హయాంలో అద్దె చెల్లించలేదు. వందమందికి గదులు సరిపోక కొందరు ఆరుబయట నిద్రిస్తున్నారు. విష సర్పాల భయంతో వణికిపోతున్నారు.

●● పచ్చలతాడిపర్రు ఎస్టీ బాలుర వసతి గృహంలో కొన్ని మరుగుదొడ్ల తలుపులు విరిగిపోయాయి. ప్రహరీ గోడ కూలిపోవడంతో విష సర్పాల సంచారంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు.

●● గుంటూరులోని బీఆర్ గార్డెన్స్ నాలుగో లైనులోని బాలుర వసతిగృహం గోడ నాలుగు నెలల క్రితం కూలిపోయి కుక్కలు లోపలికి వస్తున్నాయి.

●● గుంటూరు రాజుగారితోటలోని బీసీ సంక్షేమ బాలుర హాస్టల్‌లో సుమారు వంద మంది విద్యార్థులున్నారు. దుకాణాలు, వ్యాపార సముదాయాల కోసం నిర్మించిన ఈ భవనంలో గదులన్నీ ఇరుకిరుగ్గా ఉన్నాయి. చిన్న గదిలో నలుగురు నుంచి ఆరుగురు వరకు సర్దుబాటు చేసుకోవాల్సి వస్తోంది. రాత్రిపూట కాపలాదారుడు లేరు.


తెనాలి: నాజర్‌పేట ఎస్సీ బాలుర వసతిగృహంలో మరమ్మతులు చేయించకుండా వదిలేసిన మరుగుదొడ్లు


ఏటీ అగ్రహారంలో పాచిపట్టి అధ్వానంగా..

జిల్లాలో శాఖల వారీగా వసతి గృహాలు (ప్రీ మెట్రిక్, కళాశాలలు కలిపి)

ఎస్సీ:	34
ఎస్టీ:	7
బీసీ:	30
మొత్తం విద్యార్థులు సుమారు	4500

విద్యార్థులకు దుప్పట్లు అందలేదు.

●● గుంటూరు లాడ్జికూడలిలోని ఎల్ఈఎం పాఠశాల క్యాంపస్‌లోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో 63 మందికి ఆరు మరుగుదొడ్లే ఉన్నాయి. ఒకదానికి తలుపుల్లేవు. బురద, మురుగు చేరి పాచిపట్టి అపరిశుభ్రంగా తయారైంది. దుప్పట్లు ఇంకా అందలేదు. 7 ఫ్యాన్లకు ఒకటి పని చేయడంలేదు. కిటికీలు పగిలిపోయాయి. వసతుల్లేని ఈ భవనానికి చెల్లిస్తున్న అద్దె నెలకు రూ. 78 వేలు.


పచ్చలతాడిపర్రు ఎస్టీ వసతి గృహం చుట్టూ కూలిపోయిన ప్రహరీ

●● గుంటూరు ఏటీ అగ్రహారంలోని 13వ లైన్ హాస్టల్‌లో దుప్పట్లు ఇవ్వలేదు. గదుల్లో స్లాబ్ పడిపోతోంది. ఆర్వోప్లాంటు మూలన పడింది. మరుగుదొడ్ల తలుపులు విరిగిపోయాయి. కిటికీలకు మెష్ లేక దోమలొస్తున్నాయి.

వాతావరణ కేంద్రానికి

వీడిన వైకాపా గ్రహణం

ఈనాడు - అమరావతి

కూటమి ప్రభుత్వం చొరవతో నిర్మాణానికి అడుగులు



అమరావతిలో ఏర్పాటు చేసిన తాత్కాలిక వాతావరణ కేంద్రం

అమరావతిలో వాతావరణ కేంద్రానికి పట్టిన గ్రహణం వీడుతోంది. గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురైన ఈ కేంద్ర నిర్మాణానికి కూటమి ప్రభుత్వం వచ్చాక అడుగులు పడుతున్నాయి. జంగిల్ క్లియరెన్స్ పనులు జరుగుతున్నాయని, త్వరలో రిజిస్ట్రేషన్ చేస్తామని ఇటీవల సీఆర్‌డీఏ కమిషనర్ వాతావరణ కేంద్ర అధికారులతో చెప్పారు. ఈ ప్రక్రియ పూర్తయితే కేంద్రం నిధులు కేటాయిస్తుంది.

రాష్ట్ర రాజధానిగా అమరావతి ప్రాంతాన్ని నిర్ణయించిన తర్వాత ఇక్కడ 24 కేంద్ర ప్రభుత్వ సంస్థలు, 18 కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల ఏర్పాటుకు నాటి తెదేపా ప్రభుత్వం భూములు కేటాయించింది. అమరావతి వాతావరణ కేంద్రానికి 2019లో తుళ్లూరు సమీపంలో ఎకరం కేటాయించింది. అప్పటి ధర ప్రకారం రూ. కోటి చెల్లించారు. ఆ తర్వాత రాష్ట్రంలో ప్రభుత్వం మారడం.. జగన్ మూడు రాజధానుల ప్రకటనతో అయోమయం ఏర్పడడంతోపాటు కేంద్ర ప్రభుత్వ సంస్థల ఏర్పాటుకు సహకరించలేదు. వాతావరణ కేంద్రానికి కేటాయించిన భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని సంబంధిత వర్గాలు కోరినా నాటి సర్కారు స్పందించలేదు.

తాత్కాలిక కేంద్రంలో విధులు

ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ ప్రాంగణంలో తాత్కాలిక వసతిలో వాతావరణ కేంద్రం కార్యకలాపాలు ప్రారంభించింది. పూర్తిస్థాయి కేంద్రం ఏర్పాటైతే క్లైమటాలజీ వంటి విభాగాలుంటాయి. అదనంగా అత్యాధునిక రాడార్లు వస్తాయి. తద్వారా ఆకస్మిక వరదల వంటి వాటిని ముందుగా గుర్తించవచ్చు.

సానుకూలంగా స్పందించిన సీఆర్‌డీఏ

గత వైకాపా ప్రభుత్వం మూడు రాజధానులంటూ రైతులను రోడ్డు మీదకు తెచ్చిన వేళ అప్పట్లో ఐకాస నేతలు దిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులను కలిసినప్పుడు అమరావతిలో కేంద్ర ప్రభుత్వ సంస్థల నిర్మాణం ప్రారంభించాలని కోరారు. స్పందించిన వాతావరణశాఖ అధికారులు.. అమరావతిలో భూమి రిజిస్ట్రేషన్ పూర్తి చేస్తే పనులు ప్రారంభిస్తామని లేఖ రాశారు. అమరావతిలోని ఆ శాఖ అధికారులు... సీఆర్‌డీఏ అధికారులను మూడుసార్లు కలిసి తమ భూమి ఎక్కడుందో చూపించాలని కోరగా.. చివరకు సీఆర్‌డీఏ ఒక అధికారిని పంపింది. ఆ స్థలంలో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయని, గుర్తించలేమని చెప్పి ఆయన వెళ్లిపోయారు. దీంతో నిర్మాణ ప్రక్రియ ముందుకు కదల్లేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక సీఆర్‌డీఏ అధికారులతో వాతావరణశాఖ అధికారులు మాట్లాడగా సానుకూల స్పందన వచ్చింది. త్వరలోనే స్థల రిజిస్ట్రేషన్ చేస్తామన్న హామీతో ఈ కేంద్రం ఏర్పాటుకున్న అడ్డంకులు తొలగిపోయాయి.

భవనాల గుర్తింపు సర్వే

శంకర్ విలాస్ వంతెన విస్తరణకు అడుగులు

ఈనాడు, అమరావతి: గుంటూరు నగరంలోని శంకర్‌విలాస్ వంతెన విస్తరణ దిశగా పనులు మొదలయ్యాయి. బ్రాడీపేట ఒకటో లైన్ నుంచి లాడ్జి సెంటరు వరకు ప్రస్తుతం రోడ్డు వెడల్పు ఎంత? ఇందులో మురుగు కాలువల వెడల్పు? అరండల్‌పేట ఒకటో లైను నుంచి లాడ్జి సెంటరు వరకు వెడల్పు వివరాల కోసం ప్రణాళిక విభాగం సర్వే చేస్తోంది. ఇది శనివారంతో ముగుస్తుందని అధికారులు తెలిపారు. ఒక్కో రోడ్డు పరిధిలో ఉన్న భవనాలు, పక్కా, ఇతర ఇళ్ల వివరాలను గ్రేడింగ్ చేస్తున్నారు. విస్తరణ కారణంగా ఏ భవనం ఎంత మేర స్థలాన్ని కోల్పోతుంది? నష్ట పరిహారంగా ఇచ్చేందుకు ఎన్ని టీడీఆర్‌లు అవసరమవుతాయి? తదితర లెక్కలేస్తున్నారు. ఈ పనులు మొదలయ్యాక భవన యజమానులతో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తామని జీఎంసీవర్గాలు తెలిపాయి.


సర్వే చేస్తున్న ప్రణాళిక విభాగం సిబ్బంది

మూడు రోజుల పోలీస్ కస్టడీకి రౌడీషీటర్ బోరుగడ్డ

గుంటూరు(పట్టాభిపురం), న్యూస్‌టుడే: రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కుమార్‌ను మూడు రోజులు పాటు పోలీస్ కస్టడీకి అనుమతి ఇస్తూ గుంటూరు అయిదో అదనపు మెజిస్ట్రేట్ ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరులోని ఏఈఎల్‌సీ చర్చి వివాదంలో కోశాధికారి కర్లపూడి బాబూప్రకాశ్‌ను రూ.50 లక్షలు ఇవ్వాలని, ఇవ్వకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని బెదిరించిన కేసుతోపాటు పలు పోలీస్ స్టేషన్లలో సుమారు 20 వరకు కేసులు ఉన్నాయి. అనిల్‌కుమార్ ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉండగా.. పోలీసులు కస్టడీకి ఇవ్వాలని అయిదో అదనపు మెజిస్ట్రేట్‌ను కోరారు. దీంతో న్యాయస్థానం ఈనెల 26వ తేదీ మధ్యాహ్నం నుంచి 29వ తేదీ మధ్యాహ్నం వరకు బోరుగడ్డ అనిల్‌కుమార్‌ను పోలీస్ కస్టడీకి అనుమతి ఇచ్చింది. రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి శనివారం పోలీసులు గుంటూరుకు తీసుకురానున్నారు.

ఈనాడు కథనాల ఫలితం

ఎయిమ్స్‌కు నవంబరులో నీళ్లు

● 85 శాతం పనులు పూర్తి ● ట్రయల్‌రన్‌కు సన్నాహాలు

ఈనాడు - అమరావతి


తుది దశలో సంపుహౌస్ పనులు


నిర్మాణంలో కెమికల్ హౌస్

మంగళగిరి ఎయిమ్స్‌కు నవంబరు నెలాఖరుకు నీళ్లందించాలన్న లక్ష్యంతో ప్రజారోగ్య ఇంజినీరింగ్ విభాగం పనులు వేగవంతం చేసింది. స్టేజి-2 అనుమతులు మొదలుకుని.. పెండింగ్ బిల్లుల చెల్లింపుల వరకు కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని పరిష్కరించింది. ఇప్పటిదాకా రూ. 5.48 కోట్ల విలువైన 85 శాతం పనులు పూర్తయ్యాయి. ఇది అందుబాటులోకి వస్తే వైద్యులు, వైద్య, నర్సింగ్ విద్యార్థులు, సిబ్బందితో పాటు రోగులకు మంచినీటి వెతలు తీరతాయి.

● గత వైకాపా ప్రభుత్వం పూర్తి స్థాయిలో అనుమతులు తీసుకోకుండా ముందుకెళ్లింది. దీనిపై కేంద్రం నుంచి అభ్యంతరాలు వ్యక్తం కావడం.. ఇతరత్రా కారణాలతో నాటి పాలకులు పనులను పూర్తిగా విస్మరించారు. ● నిత్యం వెయ్యిమందికిపైగా రోగులు వస్తున్న ఎయిమ్స్‌లో నీటి సమస్య వల్ల సేవలకు అంతరాయాలు కలుగుతున్నాయి. ఈ విషయాన్ని 'ఈనాడు' ఎన్నో కథనాల ద్వారా వెలుగులోకి తీసుకొచ్చింది. స్పందించిన తెదేపా కూటమి ప్రభుత్వం అవసరమైన అనుమతులు సాధించి పనుల పూర్తికి అన్ని చర్యలూ తీసుకుంది.

ఆత్మకూరు ఛానల్ నుంచి ట్రయల్‌రన్..

గుంటూరు ఛానల్ నుంచి ఆత్మకూరు చెరువులోకి నీటిని పంపింగ్ చేయడానికి ఏర్పాట్లు చేశారు. అక్కడి నుంచి గ్రావిటీపై పైపులైను ద్వారా అందించేందుకు పనులు చేస్తున్నారు. ఈ నెలాఖరున ట్రయల్‌రన్ నిర్వహిస్తారు. ఇది విజయవంతం కాగానే పైపులైన్ గట్టిదనం ఎలా ఉందో ట్రయల్‌రన్ నిర్వహిస్తారు. ఇబ్బందులేమీ లేవని నిర్ధరించుకున్నాకే సంపుహౌస్‌లో నీళ్లు నిల్వ చేసి పరిశీలిస్తామని అధికారులు తెలిపారు. మిగిలిన 15 శాతం పనులు నవంబరు మొదటి వారంలో పూర్తవుతాయని ప్రజారోగ్య ఇంజినీరింగ్ అధికారి ఒకరు తెలిపారు.

ఇదీ ప్రగతి... ★ రోజుకు 2.50 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన నీటి శుద్ధి ప్లాంటులో ఫిల్టరేషన్ హౌస్, కెమికల్ హౌస్, క్లారి ఫ్లోక్యులేటర్, ఫ్లాష్ మిక్సర్ నిర్మాణాలు పూర్తయ్యాయి. ★ రా వాటర్ డ్రాయల్ ఎరేంజ్‌మెంట్స్ పనులు, కొలనుకొండ వద్ద జాతీయ రహదారి మీదుగా పైపులైన్ నిర్మాణం, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులు పూర్తయ్యాయి.

ఇంకా చేయాల్సినవి... ★ ఎలక్ట్రో మెకానికల్ ఎక్విప్‌మెంట్ ఇన్‌స్టాలేషన్. ★ 250 ఎంఎం డయా వాటర్ పైపులైనుకు సంబంధించి 438 మీటర్లు, 200 ఎంఎం డయా 456 మీటర్ల పరిధిలో పైపులైను పనులు.

విద్యుత్తు బస్సులొస్తున్నాయ్!

ఈనాడు - అమరావతి



ప్రత్యేకతలు
- బస్సుల పొడవు 12 మీటర్లు
- ఒక్కో బస్సులో సీట్లు: 42
- ఒకసారి ఛార్జింగ్ చేస్తే 150 కిలోమీటర్లు ప్రయాణిస్తాయి.

వాతావరణంలో కాలుష్య ఉద్గారాలను తగ్గించే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. ఇందులో భాగంగా ప్రజా రవాణా వ్యవస్థలోకి విద్యుత్తు బస్సులను ప్రవేశ పెడుతున్నాయి. 'పీఎం ఈ-బస్ సేవ' పథకం కింద రాష్ట్రం నుంచి కేంద్రానికి వెళ్లిన ప్రతిపాదనల్లో గుంటూరు జిల్లాకు వంద బస్సులు కావాలని కోరారు. వీటి వల్ల కాలుష్యం తగ్గుతుంది. నిర్వహణ వ్యయం కూడా బాగా తక్కువే. ఒకసారి ఛార్జింగ్ చేస్తే 150 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని బస్సు రానుపోనూ వంద కిలోమీటర్ల దూరం ఉండేలా ఆయా మార్గాల్లో పల్లె వెలుగు కింద నడపాలని అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం ఆర్టీసీలో ఎక్కువ కిలోమీటర్లు తిరిగిన ఎక్స్‌ప్రెస్‌లను పల్లెవెలుగు కింద మార్చి నడుపుతున్నారు. వీటి నిర్వహణ వ్యయం పెరగడంతోపాటు కాలుష్యానికి కారకాలవుతున్నాయి. వచ్చే వంద బస్సుల్లో అల్ట్రా డీలక్స్ సర్వీసులుగా 20, మిగిలినవాటిని పల్లెవెలుగు కింద నడపనున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం రవికాంత్ తెలిపారు. ఛార్జీల భారం పెద్దగా ఉండదని చెబుతున్నారు.

పెదకాకానిలో ఛార్జింగ్ స్టేషన్

గుంటూరు నగరానికి సమీపంలో ఉన్న పెదకాకాని బస్టాండు వెనుక ఆర్టీసీకి 3.5 ఎకరాల స్థలం ఉంది. ఇక్కడ విద్యుత్తు ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. భవిష్యత్తులో ఫాస్ట్ ఛార్జింగ్ కేంద్రాలు అందుబాటులోకి వస్తే పల్నాడు బస్టాండులోనూ నెలకొల్పాలన్న ప్రణాళికలున్నాయి.

విద్యుత్తు బస్సులు నడిపే మార్గాలివే....

నుంచి	వరకు	దూరం	బస్సులు
గుంటూరు	విజయవాడ	33	20
గుంటూరు	తెనాలి (వయా.. నారాకోడూరు)	26.5	30
గుంటూరు	సత్తెనపల్లి	35	15
గుంటూరు	పొన్నూరు	30	10
గుంటూరు	చిలకలూరిపేట	40	10
గుంటూరు	హైకోర్టు	40	5
గుంటూరు	సచివాలయం	42	5
గుంటూరు	అమరావతి	38	5
మొత్తం			100

నైపుణ్యాభివృద్ధితో ఉపాధి అవకాశాలు


మాట్లాడుతున్న కలెక్టరు నాగలక్ష్మి

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: పీఎం విశ్వకర్మ పథకానికి ఇప్పటికీ దరఖాస్తు చేసుకోని వారితో దరఖాస్తు చేయించడంతో పాటు నైపుణ్యాభివృద్ధి పెంపొందించి స్వయం ఉపాధి అవకాశాలు పొందేలా శిక్షణ ఇవ్వాలని అధికారులను కలెక్టరు ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో నైపుణ్యాభివృద్ధి సమితి సభ్యులు, శిక్షణ సంస్థల అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశాన్ని కలెక్టరు నిర్వహించి మాట్లాడారు. ఇప్పటి వరకు బ్యాంకర్లకు వచ్చిన దరఖాస్తులు ఎన్ని? ఎన్ని తిరస్కరించారు? వంటి వివరాలు అందజేయాలన్నారు. రుణాలు ఇవ్వడానికి హామీలు అడుగుతున్నట్లు తెలిసిందని.. ఎల్‌డీఎం దీనిపై పర్యవేక్షించి పరిష్కరించాలని స్పష్టం చేశారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జయలక్ష్మి మాట్లాడుతూ జీపీయూఎల్‌బీ కింద 63,689 దరఖాస్తులు వచ్చాయని.. స్టేజ్-1లో 52,286, స్టేజ్-2లో 4,928, స్టేజ్-3లో 3,885 దరఖాస్తులను సిఫార్సు చేసినట్లు వివరించారు. మండల స్థాయిలో పీఎంవీకే పథకంలో 29,200 దరఖాస్తులు రాగా.. స్టేజ్-1లో 28,195 మందికి రుణాల మంజూరు కోసం ప్రతిపాదించామన్నారు.

ఎంపిక చేసినా రావడం లేదు

సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో శిక్షణకు ఎంపికైన వారికి ఫోన్ చేసి మాట్లాడినా రావడం లేదని జయలక్ష్మి తెలిపారు. రూ.లక్ష రుణం మంజూరు చేసేందుకు బ్యాంకర్లు ష్యూరిటీలు అడుగుతున్నారని చెప్పారు. జిల్లాలో విశ్వకర్మ పథకం వెనుకబడి ఉండటతో పాటు కేంద్రాల్లో శిక్షణ సరిగా అందడంలేదన్నారు. ఉచితంగా ఇవ్వాల్సిన దరఖాస్తులను రూ.150 నుంచి రూ.300 వరకు తీసుకుంటున్నారని కలెక్టరు దృష్టికి తీసుకొచ్చారు. పంచాయతీ స్టేజ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించకుండా తిరస్కరిస్తున్నారని, శిక్షణ పొందిన వారికి స్టైపండ్ అందలేదన్నారు. సమావేశంలో జిల్లా విశ్వకర్మ పథకం కమిటీ సభ్యులు టి.రామకృష్ణకుమార్ గౌడ్, జీఎంసీ ఉప కమిషనరు డి.శ్రీనివాస్, ఎల్‌డీఎం ఎం.మహిపాల్‌రెడ్డి, డీఎస్‌డీవో సంజీవరావు, ప్రత్యేక ఆహ్వానితులు రవికాంత్, రవీంద్ర, శ్యాంబాబు, రమేష్, సతీష్, శోభారాణి పాల్గొన్నారు.

సృజనశీలురు.. అనితరసాధ్యులు

- ఆర్వీఆర్‌జేసీ విద్యార్థుల నూతన ఆవిష్కరణ
- జాతీయ స్థాయిలో ఓవరాల్ ఛాంపియన్‌షిప్

ఎస్వీఎన్‌కాలనీ(గుంటూరు), న్యూస్‌టుడే

తరగతి గదిలో అధ్యాపకులు చెప్పే పాఠాలు, తర్వాత రాత పుస్తకాలతో కుస్తీ పట్టి పరీక్షలు రాయడం వంటి మూస పద్ధతులతో వచ్చే మార్కులతోనే నేటి పోటీ ప్రపంచంలో నెగ్గలేమని గ్రహించారు ఆ విద్యార్థులు. మారుతున్న కాలానికి అనుకూలంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలనే ఆలోచనతో మెదడుకు పదునుపెట్టి నూతన ఆవిష్కరణలకు నాంది పలికారు. తాము రూపొందించేవి సామాన్యులకు ఉపయోగపడాలనే లక్ష్యంతో ప్రయోగాలు చేశారు. తయారు చేసిన వాటిని పోటీల్లో ప్రదర్శించి బహుమతులు సైతం గెలుచుకొని ఆదర్శంగా నిలుస్తున్నారు. నగర శివారులోని ఆర్వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు యాజమాన్యం ఆర్థిక సాయంతో రూపొందించిన 'ఈ బైక్' కోయంబత్తూరులో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో పలు విభాగాల్లో బహుమతులు గెలుచుకొన్నారు. ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచిన యంత్ర విద్యార్థులపై కథనం.


విద్యార్థులు రూపొందించిన ఈబైక్

రాత్రింబవళ్లు ఇక్కడే!

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించాలనే ఆలోచనతో కళాశాల యాజమాన్యం 'ఎస్‌ఏఈ క్లబ్ సొసైటీ ఆఫ్ ఆటోమోటివ్ ఇంజినీర్స్' అనే పేరుతో ఒక క్లబ్‌ను 2017లో ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఈ-బహ, ఎం-బహ, గో-కార్ట్, హైబ్రీడ్ పేర్లతో గతంలో వాహనాలను రూపొందించారు. ఈ ఏడాది పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా 'ఈబైక్' రూపకల్పనలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగం నుంచి 21 మంది, మెకానికల్ నుంచి నలుగురు, ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ నుంచి ఒక్కరు చొప్పున మొత్తం 26 మంది పని చేశారు. అశోక్ నాయకత్వంలో కార్తీక్ సమన్వయకర్తగా వ్యవహరించారు. తరగతులకు ఎలాంటి ఆటంకం లేకుండా సాయంత్రం వేళల్లో ఈబైక్‌ను రూపొందించారు. కొంతమంది విద్యార్థులు రాత్రి వేళల్లో కూడా బైక్ నిర్మాణంలో పాలుపంచుకున్నారు. ఈఈఈ సహాయ అధ్యాపకుడు పి.వెంకట మహేష్, టెక్నీషియన్ ఆర్.మారుతీవరప్రసాద్ పర్యవేక్షణలో విద్యార్థులు 'ఈబైక్' వాహనాన్ని రూపొందించారు.



ఓవరాల్ ఛాంపియన్‌షిప్ గెలుచుకున్న విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

ఈబైక్ తీర్చిదిద్దారు ఇలా..

పర్యావరణం కలుషితం కాకుండా చూడడం, తక్కువ ఖర్చుతో సమర్థంగా పని చేసే 'ఈబైక్'ను రూపొందించారు. రెట్రోఫిట్ అనగా అవసరాలకు అనుగుణంగా మార్చుకోవడానికి వీలైన ప్రాథమిక నమూనాగా బైక్‌ను తీసుకున్నారు. ఈ ఎలక్ట్రిక్ బైక్‌లో 2 కిలోవాట్, 60 ఓల్టుల మోటారు, 40 ఆంపియర్ల సామర్థ్యం గల బ్యాటరీ ఉపయోగించారు. మోటారుతో పాటు ఇతర భాగాలను నియంత్రించడానికి 4 కిలోవాట్ల నియంత్రకాన్ని వాడారు. ఒకసారి ఛార్జి చేస్తే.. సుమారుగా 80 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో 90 కిలోమీటర్ల వరకు ప్రయాణించొచ్చు. ఈ బైక్‌లో ప్రధానంగా మూడు ఆవిష్కరణలు చేశారు. ఏటీఎస్(యాంటీ థెఫ్ట్ సిస్టమ్) మాడ్యూల్‌లో భాగంగా బైక్‌ను ఎవరైనా దొంగతనం చేస్తే వెంటనే చరవాణికి సమాచారం అందిస్తుంది. ఏఎఫ్‌టీ (ఆటోమొబైల్ ఫైన్‌ట్యూనింగ్) ద్వారా ఎక్కడ బైక్‌లో సమస్య ఉంటే చరవాణిలో చూపిస్తుంది. వాహనానికి ముందు అమర్చిన విండ్ టర్బయిన్ ద్వారా బండి కదులుతున్న సమయంలో రీఛార్జి అవుతుంది.

విజేతలుగా నిలిచిన తీరు

హిల్‌క్లైంబింగ్ రేస్‌లో భాగంగా కొండను ఎక్కించడం, యాక్సిలరేషన్‌లో వాహనం వేగంగా పికప్ తీసుకునే విధానం. ఆటోక్రాస్‌లో భాగంగా బైక్‌ను బ్యాలెన్స్ చేసే పద్ధతిలో గుంతలు, ఇసుక, కంకర, ఎగుడు దిగుడు, బురదతో కూడిన ట్రాక్‌ల మీద వాహనాన్ని నడపడం, టెక్నికల్ ఇన్‌స్పెక్షన్స్(ఎలక్ట్రికల్, మెకానికల్, రక్షణ), బండిని నిదానంగా నడపడం అంశాల్లో పారిశ్రామికవేత్తలు, నిపుణుల సమక్షంలో వాహన పరీక్షలు ఎదుర్కొని జాతీయ స్థాయిలో విజేతలుగా నిలిచి ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించారు.

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలో ప్రమాదకర రసాయనాలు వినియోగించే పరిశ్రమలు ప్రభుత్వం నిర్దేశించిన ఆన్‌సైట్ అత్యవసర ప్రణాళిక అమలుకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకునేలా చూడాలని కలెక్టరు ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో ఎస్పీ సతీష్‌కుమార్‌తో కలిసి జిల్లా పరిశ్రమలు, ఎగుమతులు ప్రోత్సాహక కమిటీ సమావేశం, జిల్లా క్రైసిస్ గ్రూప్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. నాగలక్ష్మి మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుకు సింగిల్ విండో ద్వారా అందిన దరఖాస్తులను అనుమతులు మంజూరు చేసేలా పరిశ్రమల శాఖ అధికారులు పర్యవేక్షించాలన్నారు. తెనాలిలో ఏర్పాటు చేసే పప్పు మిల్ క్లస్టర్ భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. పరిశ్రమలకు రాయితీ రూ.93,08,261 మంజూరు చేస్తూ కలెక్టరు ఆమోదించారు.

చర్యలు తీసుకోకపోతే నోటీసులు

జిల్లా క్రైసిస్ గ్రూప్ సమావేశంలో కలెక్టరు మాట్లాడుతూ తనిఖీల్లో గుర్తించిన అంశాలపై అవసరమైన చర్యలు నిర్దేశిత సమయంలో తీసుకోని పరిశ్రమలకు నోటీసులు జారీ చేయాలన్నారు. ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవిస్తే నిమిషాల్లోనే స్పందించేలా ప్రత్యేక యంత్రాంగాన్ని అత్యవసర ప్రణాళికలో రూపొందించాలని వివరించారు. డీపీఎం లక్ష్మీకుమారి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్‌రెడ్డి, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం జయలక్ష్మి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మంగాదేవి, డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

పానుగంటి చైతన్యకు వైద్య పరీక్షలు

గుంటూరు(నగరంపాలెం), న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో తెదేపా కార్యాలయంపై దాడికి పాల్పడిన కేసులో ఏ1 ముద్దాయి పానుగంటి చైతన్యను సీఐడీ పోలీసులు కస్టడీకి కోరగా కోర్టు అనుమతి ఇవ్వడంతో జిల్లా జైలు నుంచి అధికారులు నేరుగా జీజీహెచ్‌కు తరలించారు. అత్యవసర వైద్యసేవల విభాగంలో అతడికి రక్తపోటు, మధుమేహం, తదితర వైద్య పరీక్షలు చేశారు. ఎలాంటి ఇబ్బంది లేదని వైద్యులు నిర్ధారించడంతో చైతన్యను పోలీసులు సీఐడీ కార్యాలయానికి తరలించారు.

అధిక రసాయన మందుల వినియోగంతో దిగుబడి పతనం


మాట్లాడుతున్న లాంఫాం ఏడీఆర్ దుర్గాప్రసాద్

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: పంట సేద్యంలో రైతులు అధిక ఎరువులు, రసాయన మందులు వినియోగించడంతో పంటల దిగుబడి తగ్గడంతో పాటు భూమి సారం కోల్పోతుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం లాంఫాం ఏడీఆర్ ఎన్‌వీవీఎస్ దుర్గాప్రసాద్ అన్నారు. గుంటూరుకు సమీపంలోని లాంఫాం ఆడిటోరియంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ప్రతినిధులకు సమగ్ర పోషక యాజమాన్యం అనే అంశంపై ఆగ్రో-గుంటూరు ఏరువాక కేంద్రం, సమేటి, మేనేజ్ సంయుక్త ఆధ్వర్యంలో 15 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. సమేటి రాష్ట్ర కార్యాలయం ఏడీఏ పుణ్యవతి, ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ విస్తరణ విభాగం సంచాలకుల కార్యాలయం ప్రధాన శాస్త్రవేత్తలు బి.ముకుందరావు, వి.విశాలాక్షి, గుంటూరు ఏరువాక కేంద్రం సమన్వయకర్త ఎన్.వెంకటలక్ష్మిలు ఎరువుల వినియోగంపై మాట్లాడారు. సమావేశంలో సీనియర్ శాస్త్రవేత్త ఎం.వెంకటరాములు, పశ్చిమగోదావరి, గుంటూరు జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి

కొనసాగిన విద్యార్థుల ఆందోళన


కళాశాలలో విద్యార్థులు, టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకుల ఆందోళన

మేడికొండూరు, న్యూస్‌టుడే : తమకు న్యాయం చేయాలంటూ పేరేచర్లలోని ఓ ప్రైవేటు కళాశాల విద్యార్థులు చేపట్టిన ఆందోళన కొనసాగింది. కళాశాలలో నాలుగో ఏడాది చదువుతున్న విద్యార్థులు, టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు కలిసి శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ హాల్ టిక్కెట్లు ఇచ్చి పరీక్షలన్నీ రాసిన తర్వాత ఇలా చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. పరీక్షలు రాయకపోతే తమ భవిష్యత్తు ఏమిటని వాపోయారు. అక్కడే ఉన్న పోలీసులు ఆందోళన విరమించాలని చెప్పినా పట్టువదలలేదు. కాసేపటికి మేడికొండూరు సీఐ నాగూర్‌మీరా సాహెబ్ అక్కడకు వచ్చారు. విద్యార్థుల సమస్య తెలుసుకున్నారు. కళాశాలలో నాలుగో ఏడాదికి సంబంధించిన విద్యార్థుల పేర్లు, వారి హాజరు శాతం వివరాలు వర్సిటీ అధికారులకు పంపించామని, కొందరు అర్హత సాధించారని మరి కొందరు అర్హత సాధించలేదని అంతకమించి కళాశాల పాత్ర ఏమిలేదని అధ్యాపకులు పోలీసులకు వివరించారు. యూనివర్సిటీ జారీ చేసిన సదరు పత్రాలు చూపాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. అవి తమ చేతుల్లో లేవని అధ్యాపకులు పేర్కొనడంతో విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హాజరు శాతం తగ్గినా అపరాధ రుసుం కట్టించుకుని పరీక్ష రాసే అవకాశం ఉన్నా ఎందుకు చేయలేదని నిలదీశారు. కళాశాల వారు హాజరు వేయడం లేదని విద్యార్థులు వాపోయారు. కావాలనే హాజరు శాతం తగ్గించారని కొంత మంది ఆరోపించారు. సమస్య ఇప్పట్లో తేలే పరిస్థితి కనిపించకపోవడంతో పోలీసులు టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులను పోలీస్ వాహనంలో ఎక్కించుకుని రాణాకు తరలించారు. విద్యార్థులను మందలించి తరగతి గదులకు పంపించారు. సమస్య సామరస్యంగా పరిష్కరించుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. దీంతో అందరూ అక్కడ నుంచి వెళ్లిపోయారు.


టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులను పోలీస్ వాహనంలో రాణాకు తరలింపు

సమస్యలు పరిష్కరించాలని 117 అర్జీలు

సీఆర్డీఏ కార్యాలయానికి తరలివస్తున్న రైతులు


రైతుల సమస్యలు తెలుసుకుంటున్న సీఆర్డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్

తుళ్లూరు, న్యూస్‌టుడే : సమస్యలు పరిష్కరించాలంటూ శుక్రవారం తుళ్లూరు ప్రాంతీయ సీఆర్డీఏ కార్యాలయానికి రైతులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. సీఆర్డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్ చంద్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని రైతుల సమస్యలు తెలుసుకున్నారు. కొన్నింటిని వెంటనే పరిష్కరించగా, మరికొన్నింటిని పరిష్కరించాలని అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గ్రీవెన్స్ డే నిర్వహించారు. మొత్తం 117 అర్జీలు వచ్చాయి. 112 భూమి వ్యవహారాలు, 3 ప్రణాళికా విభాగం, సామాజిక అభివృద్ధి, సర్వేకు సంబంధించి ఒక్కో అర్జీ వచ్చాయి. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.విశ్వేశ్వరనాయుడు, కె.స్వర్ణమేరి, బి.సాయి శ్రీనివాస్ నాయక్, జి.భీమారావు, డీసీడీవో బొర్రా శ్రీనివాసరావు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 120, రిటైల్ ధర - 142, చికెన్ విత్‌స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 125, 134, 145 చికెన్ విత్ స్కిన్ - 236 చికెన్ స్కిన్‌లెస్ - 246.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 540 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

డీఎస్సీ శిక్షణకు దరఖాస్తు గడువు పెంపు

జిల్లాపరిషత్తు(గుంటూరు): డీఎస్సీ ఉచిత శిక్షణకు షెడ్యూల్డ్ కులాలు, తెగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే గడువును ప్రభుత్వం ఈనెల 27 వరకు పొడిగించిందని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు మధుసూదన్‌రావు శుక్రవారం తెలిపారు. ఈనెల 25తో గడువు ముగిసినా ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు జ్ఞానభూమి వెబ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

వైభవంగా పోలేరమ్మ ఆలయ ప్రతిష్ఠ



తుళ్లూరు, న్యూస్‌టుడే: తుళ్లూరు అయ్యన్న చెరువు 4వ లైనులో నూతనంగా నిర్మించిన ఆలయంలో పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఉదయం 8.30 గంటలకు మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛారణలతో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అన్న సంతర్పణ జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

అభివృద్ధి పనులు వేగవంతం కావాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: నగరపాలకసంస్థ పరిధిలోని ప్రత్తిపాడు నియోజకవర్గం ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం కావాలని ఎమ్మెల్యే బి.రామాంజనేయులు అధికారులను సూచించారు. శుక్రవారం జీఎంసీ సమావేశ మందిరంలో విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గంలోని 8 డివిజన్లు జీఎంసీ పరిధిలో ఉన్నాయని, అక్కడ తక్షణం మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అభివృద్ధి పనుల్లో జాప్యం జరుగుతోందన్నారు. కార్పొరేటర్లు ఎన్.బాలాజీ, వై.పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల కోరల్లో వసతి గృహాలు

☛ శిథిలావస్థలో గదులు
☛ మరుగుదొడ్లకు తలుపులు లేని వైనం



దుగ్గిరాలలో తలుపు లేని కిటికీలు



ఊడిపోయి అధ్వానంగా మరుగుదొడ్ల తలుపులు

దుగ్గిరాల, న్యూస్‌టుడే

మంగళగిరి, ప్రత్తిపాడు, తాడికొండ నియోజకవర్గాల్లోని పలు వసతిగృహాల్లో నెలకొన్న సమస్యలతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. కొన్నింటిలో కిటికీల అద్దాలు పగిలిపోయాయి. మరికొన్ని చోట్ల శ్లాబు పెచ్చులూడి పడుతుండడం.. స్నానాల గదులకు తలుపులు సరిగా లేకపోవడం వంటి సమస్యలతో విద్యార్థులు బాధపడుతున్నారు.

✶ దుగ్గిరాల ఎస్సీ బాలుర వసతిగృహంలో తలుపులకు కిటికీలు లేవు. అద్దాలు పగిలిపోయాయి. రెండు కిటికీలకు కర్టెన్లు ఏర్పాటు చేశారు. మొత్తం 61 మంది ఇక్కడ ఉన్నారు. మరుగుదొడ్లకు తలుపులు లేవు. ఇదే భవనంలో పై అంతస్థులో కళాశాల విద్యార్థులకు గదులున్నాయి. అక్కడా మరుగుదొడ్లకు తలుపులు లేవు. విద్యుత్తు దీపాలూ వెలగడం లేదు.

మేడికొండూరు, ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే : ఫిరంగిపురంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో 37 మంది విద్యార్థులున్నారు. మొత్తం 19 మరుగుదొడ్లు ఉండగా వాటిల్లో 6 మాత్రమే పని చేస్తున్నాయి. మిగిలిన వాటిల్లో పైపులైన్లు, షింకులు, తలుపులు దెబ్బతినడంతో నిరుపయోగంగా మారాయి. మూడేళ్ల కిందట నీటి శుద్ధి యంత్రం పాడైనా ఇప్పటి వరకు బాగు చేయలేదు. దీంతో నిత్యం 20 లీటర్ల పరిమాణం గల సుమారు 6 నీటి డబ్బాలను వార్డెన్ తన డబ్బులతో కొనుగోలు చేస్తున్నారు. దీనికి ప్రభుత్వం నుంచి ఎలాంటి బిల్లు రావడం లేదు. ప్రభుత్వం నుంచి దుప్పట్లు అందకపోవడంతో విద్యార్థులు చలికి ఇబ్బంది పడుతున్నారు.

✶ ఫిరంగిపురంలో వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ చెందిన(బీసీ) బాలుర వసతి గృహానికి సొంత భవనం లేదు. 30 ఏళ్లుగా అద్దె ఇంట్లో కొనసాగుతుంది. ప్రభుత్వం ప్రతి నెలా రూ.19 వేలు చెల్లిస్తోంది.



నిరుపయోగంగా మరుగుదొడ్లు

కుళ్లిన కూరగాయలతో వంటలు



తాడికొండ: మెస్‌లో పాడైపోయిన కూరగాయలు



గురుకుల పాఠశాల వసతి గృహంలో పగిలిన కిటికీ అద్దాలు



ప్రత్తిపాడు: చినిగిన కిటికీల మెష్‌లు



పెదనందిపాడు: పగిలిన మరుగుదొడ్ల తలుపులు

తాడికొండ, ప్రత్తిపాడు, పెదనందిపాడు, న్యూస్‌టుడే: తాడికొండ గ్రామం అడ్డరోడ్డుకు సమీపంలో ఉన్న గురుకుల పాఠశాలలో సమస్యలు కుప్పలుగా ఉన్నాయి. పాఠశాలలో ప్రస్తుతం 443 విద్యార్థులు 10వసతి గృహాల్లో ఉంటున్నారు. వీటిలో కొన్ని గృహాలకు కిటికీ అద్దాలు పగిలి ఈదురు గాలులు బలంగా వీచిన సమయంలో ముక్కలు కింద పడుతున్నాయి. మరుగుదొడ్ల తలుపుల పరిస్థితి అయితే చెప్పనక్కర్లేదు మనిషి దూరి వెళ్లేంతగా మరుగుదొడ్ల తలుపులు ముక్కలుగా విరిగిపోయాయి. ఈ పాఠశాలకు కూరగాయలు వంట సామాన్లు పంపిణీ చేసే కాంట్రాక్టర్లు నాణ్యతలేని కూరగాయలను సరఫరా చేస్తున్నారు. కుళ్లి తినేందుకు వీలులేని పరిస్థితిలో ఉంటున్నాయి. చేసేదేమి లేక పిల్లలకు నాణ్యతలేని కూరగాయలతో ఆహార పదార్థాలు తయారు చేసి భోజనం అందిస్తున్నారు. పాఠశాల ఆవరణలో ఎక్కువగా గడ్డి పెరిగి దోమలు, కీటకాలు వృద్ధి చెందుతున్నాయి. వర్షాకాలంలో పాఠశాల ముందు వాగు పొంగి పాఠశాలలోకి ప్రవేశించే ప్రధాన మార్గంలో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది.

ప్రత్తిపాడులో...: ప్రత్తిపాడులోని ఎస్సీ బాలికల వసతి గృహంలో ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు 20 మంది ఉంటున్నారు. భవనంలోని నాలుగు గదులు పూర్తిగా దెబ్బతిని పెచ్చులూడి నీరు కారుతుంటే ఆ గదులను మూసి వేశారు. కొన్ని గదుల్లో శ్లాబు ఊడి ఉన్నా ఆ గదుల్లోనే బాలికలు పెట్టెలు, వస్త్రాలు, నిద్రించడం అన్నీ చేస్తున్నారు. కిటికీల మెష్‌లు చిరిగిపోవడంతో దోమల బెడద ఎక్కువగా ఉందని బాలికలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

న్యూస్‌టుడే: పెదనందిపాడులోని ఎస్సీ బాలుర వసతి గృహంలో కొన్ని మరుగుదొడ్ల తలుపులు పగిలి విద్యార్థులు అసౌకర్యం చెందుతున్నారు. ఈ ఏడాది ఇంత వరకు దుప్పట్లు(కంబళ్లు) ఇవ్వలేదు. ఉన్నవే పాత దుప్పట్లతోనే కాలం గడుపుతున్నారు. చాపలు లేనందున కింద కూర్చుని చదువుకుంటున్నారు. ఆరు నుంచి పదో తరగతుల విద్యార్థులకు రాత పుస్తకాలు ఇవ్వలేదు. 2018లో దోమతెరలిచ్చారు అవి కూడా చిరిగిపోయాయి. ఆ తరువాత ఇచ్చింది లేదు.



పెదనందిపాడు: కింద కూర్చుని చదువుకుంటున్న విద్యార్థులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

? తాడేపల్లి సుందరయ్యనగర్ 25వ రోడ్డులో రాత్రి వేళలో చెత్త వేస్తున్నారు. **- కడవకొల్లు గోపాలరావు**

✔ వ్యర్థాలు తొలగిస్తాం. చెత్త వేయకుండా హెచ్చరిస్తాం.
- శ్రీకాంత్, డిప్యూటీ కమిషనర్, నగరపాలక సంస్థ

? నెక్కల్లు ఎస్సీ కాలనీలోని మురుగు కాలువల్లో నీరు నిల్వ ఉంటోంది. శుభ్రం చేయించాలి.
- రామారావు, నెక్కల్లు

✔ కార్మికులతో మురుగు కాలువలు శుభ్రం చేయిస్తాం.
- సాయినాగేంద్ర, పంచాయతీ కార్యదర్శి, నెక్కల్లు

? ప్రత్తిపాడు సత్రం పరిధిలోని దుకాణాల ఎదురు మురుగు కాల్వలో నీరు వెళ్లడం లేదు.
- దుకాణదారులు, ప్రత్తిపాడు.

✔ కాల్వలను పరిశీలించి పూడిక తీయిస్తాం.
- షేక్ ఖాజా, పంచాయతీ కార్యదర్శి, ప్రత్తిపాడు

– న్యూస్‌టుడే, తాడేపల్లి, తుళ్లూరు, ప్రత్తిపాడు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల నమోదుకు ప్రత్యేక కేంద్రాలు

మంగళగిరి, న్యూస్‌టుడే : మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో మంగళగిరి మండలంలోని పెదవడ్లపూడిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల నమోదును తెదేపా నాయకులు ప్రారంభించారు. శుక్రవారం మంగళగిరి ఆటోనగర్ వద్ద పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు వాకా మాధవరావు, తెదేపా పద్మశాలీ సాధికార సమితి జిల్లా ప్రతినిధి జొన్నాదుల బాలకృష్ణ సంయుక్తంగా ప్రత్యేకంగా ఓట్ల నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వచ్చే నెల 6వ తేదీ లోపు ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్ చంద్, నాయకులు మాదల రమేష్ తదితరులు ప్రత్యేక కేంద్రం ద్వారా డిగ్రీ పూర్తి చేసిన వారికి పట్టభద్రుల ఎమ్మెల్సీకి ఓట్లు నమోదు చేయించారు.

పెదనందిపాడు, న్యూస్‌టుడే: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదుపై శుక్రవారం పెదనందిపాడులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 60 మంది ఫారం 18ని నిర్వాహకులకు అందజేశారు. తెదేపా నాయకులు నర్రా బాలకృష్ణ, సత్యహర్ష, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పెదనందిపాడు: అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు కావాలని తహసీల్దార్ శంకరబాబు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పోలింగ్‌కేంద్రాల వద్ద ఆదివారం బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారన్నారు.

క్రీడారంగానికి పారిశ్రామికవేత్తల ఆర్థిక తోడ్పాటు అవసరం



రామరాజుని సత్కరించిన రవినాయుడు

మంగళగిరి, న్యూస్‌టుడే : క్రీడారంగానికి పారిశ్రామికవేత్తల ఆర్థిక తోడ్పాటు అవసరమని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు కోరారు. మంగళగిరిలోని ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజుని శుక్రవారం ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏపీని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ఇందులో భాగంగా పారిశ్రామికవేత్తల తోడ్పాటును క్రీడారంగానికి అందించే విధంగా చూడాలని రామరాజును కోరారు. క్రీడారంగంలో పీపీపీ విధానాన్ని అమలు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

విద్యార్థుల రక్తదానం

తాడేపల్లి, న్యూస్‌టుడే : తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో విద్యార్థి సంక్షేమ విభాగం ఆధ్వర్యాన విద్యార్థులు శుక్రవారం రక్తదానం చేశారు. అమెరికన్ క్యాన్సర్ కేర్ బ్లడ్ బ్యాంక్, కేఎల్‌యూ యూత్ రెడ్ క్రాస్ సంయుక్తంగా నిర్వహించిన శిబిరంలో విద్యార్థులు 200 యూనిట్ల రక్తాన్ని ఇచ్చారు. పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.

సమస్యలతో సహవాసం.. ప్రాణాలతో చెలగాటం

మంగళగిరిలో గుంపులుగా శునకాలు ❖ పరిష్కరించాలని ప్రజల వినతి



వీధుల్లో కుక్కల సంచారం

మంగళగిరి, న్యూస్‌టుడే

మంగళగిరిలో పలు సమస్యల కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వీధుల్లో సంచరించే కుక్కలు, రోడ్లపై సంచరించే పశువులు, తిష్ఠవేసిన మురుగు, రహదారులపై అక్కడక్కడ ఏర్పడిన గుంతల వల్ల ప్రజలు పడుతున్న బాధలు అన్నీ ఇన్నీ కావు. చూడటానికి చిన్న సమస్యలుగానే కనిపించినా వాటి వల్ల కలిగే నష్టం ఎక్కువగా ఉంటోంది.

కుక్కలతో భయం.. భయం

నగరంలో వీధికుక్కల సంచారంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడ పడితే అక్కడ గుంపులుగా సంచరిస్తూ వచ్చేపోయే వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఏ వీధి చూసినా ఇదే పరిస్థితి ఉంది. ఎవరిపై పడితే వారిపై దాడులకు తెగబడుతున్నాయి. అనేక మంది వీటి బారిన పడి ప్రభుత్వ వైద్యశాలకు వెళుతున్నారు. నాలుగు వేల మంది వీధి కుక్కల దాడుల్లో గాయపడినట్లు ప్రభుత్వ వైద్యశాల దస్త్రాలు వెల్లడిస్తున్నాయి. వీధికుక్కలను పట్టించి వాటి సంతతి పెరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు నగరపాలక సంస్థ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ద్విచక్ర వాహనంపై వచ్చే ఇద్దరు యువకులు చీకట్లో కనిపించక రోడ్డుపై ఆవులను ఢీకొని దుర్మరణం చెందిన ఘటనలున్నాయి. ఆవులు రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

ఇలా ఉంటే నడక ఎలా?

టిడ్కో గృహ సముదాయం అంతర్గత మురికి కూపంలా ఉంది. ప్రధానమైన సిమెంట్ రోడ్ల వెంట మురుగు తిష్ఠవేసింది. ఏదైనా వాహనం రోడ్డు దిగితే కూరుకుపోతోంది. బ్లాకుల మధ్య నీరు పోవడం లేదు. ఫలితంగా దుర్గంధం వస్తోంది. ఆయా ప్రాంత ప్రజలు దోమకాటుకు గురవుతున్నారు. మౌలిక సదుపాయాలను కల్పించకుండా వైకాపా ప్రభుత్వం హడావిడిగా లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించింది. రాష్ట్ర ఆర్థిక శాఖకు సంబంధించిన ప్రధాన కార్యాలయం వద్ద చెత్త కుప్ప దర్శనమిస్తోంది. పాత మంగళగిరి సీతారామ కోవెల, కట్టవాగులో వ్యర్థాల వల్ల దుర్వాసన వస్తోంది.

చేతి పంపునకు మోక్షం కల్పించండి

మంగళగిరి కొత్తపేటలో రూ. రెండు లక్షల ప్రజాధనం వెచ్చించి ఏర్పాటు చేసిన చేతిపంపు చుట్టూ ఫెన్సింగ్ వేశారు. రెండేళ్లుగా చేతిపంపు వినియోగంలో లేక నిరుపయోగంగా ఉంది. దానిని వినియోగంలో తీసుకొచ్చి ప్రజలకు నీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు



టిడ్కో అంతర్గత రోడ్లు అధ్వానం

విస్తీర్ణంలో తేడాలు సరి చేయరూ

చినపాలెం(దుగ్గిరాల), పెదనందిపాడు, న్యూస్‌టుడే : చినపాలెం రెవెన్యూ పరిధిలోని భూ సమస్యల పరిష్కారానికి శుక్రవారం పెదపాలెంలో సర్పంచి పాటిబండ్ల కృష్ణప్రసాద్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. మొత్తం 25 అర్జీలు వచ్చాయి. విస్తీర్ణంలో తేడాలున్నాయని, సరిచేయాలని రైతులు కోరారు. తహసీల్దార్ సునీత, మండల సర్వేయర్ గోపాలరావు, వీఆర్వో శ్రీనివాసరావు ఉన్నారు. పెదనందిపాడు మండలం ఉప్పలపాడులో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. 19 మంది రైతులు భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అర్జీలను అందజేశారు. తహసీల్దార్ శంకరబాబు, సర్వేయర్ శ్రీనివాసరావు, ఆర్ఐ సాహితి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

తాడేపల్లి, న్యూస్‌టుడే : తాడేపల్లి పరిధిలోని నవోదయ కాలనీ, క్రిస్టియన్‌పేట, వీఆర్ అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో శనివారం ఉదయం 9:30 నుంచి 12 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈఈ సురేష్ బాబు శుక్రవారం రాత్రి తెలిపారు.

నీరుకొండ(మంగళగిరి), న్యూస్‌టుడే: మంగళగిరి మండలం నీరుకొండలో ఈ నెల 26, 27 తేదీల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ డీఈఈ సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పరిధిలోని 33కేవీ విద్యుత్తు పాతలైను కండక్టర్ మార్చి నూతన కండక్టర్ ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో సరఫరా ఉండదన్నారు.

మాజీ ఎమ్మెల్యే మన్నె చిననాగయ్య వర్ధంతి



విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామ ప్రముఖులు

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే : వట్టిచెరుకూరులోని మన్నె వజ్రమ్మ, చిననాగయ్యల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దివంగత శాసనసభ్యుడు మన్నె చిననాగయ్య వర్ధంతిని శనివారం నిర్వహించారు. జడ్పీటీసీ భీమినేని వెంకటలక్ష్మి, ఎంపీటీసీ భీమినేని కోటేశ్వరరావు, చిననాగయ్య తనయుడు మన్నె తిరుపతిరావు విశ్రాంత ఉపాధ్యాయులు నాదెండ్ల అప్పారావు, మాజీ ఎంపీటీసీ ముప్పా అంకమ్మరావు, మాజీ సర్పంచి మల్లంపాటి సాంబశివరావు, హెచ్ఎం రమాదేవి ఆయన సేవలను కొనియాడారు.

పశుగణనకు అందరూ సహకరించాలి

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే : మండలంలో 21వ అఖిల భారత పశుగణనకు పాడి రైతులందరూ సహకరించాలని తెదేపా మండల అధ్యక్షుడు శివ రామ ప్రసాద్ అన్నారు. స్థానిక పశువైద్యశాలలో శుక్రవారం పశుగణన గోడపత్రాలు ఆవిష్కరించి కిట్లను పంపిణీ చేశారు. 16 రకాల పెంపుడు జంతువులపై జాతుల వారీగా ప్రభుత్వం సమాచారం నమోదు చేస్తున్నట్లు చెప్పారు. పశువైద్యులు డాక్టరు నందకిశోర్ నాయకులు పెంటారెడ్డి, అంజిరెడ్డి, సురేశ్, సిబ్బంది తదితరులున్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

తాడేపల్లి: అనారోగ్యంతో బాధపడి వైద్యసేవలు పొందిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి నిధులు లోకేశ్ మంజూరు చేయించారని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి తెలిపారు. శుక్రవారం తాడేపల్లి మండలం ఉండవల్లి గ్రామానికి చెందిన జొన్నా హరితకు రూ.1.05లక్షలు, మంగళగిరిలోని 18వ వార్డుకు చెందిన ఉప్పల మల్లేశ్వరికి రూ.1.60లక్షల విలువైన చెక్కులను ఆమె అందజేశారు.

క్లాప్ ఆటోడ్రైవర్ల నిరవధిక సమ్మె



క్లాప్ ఆటో డ్రైవర్ల నిరసన

మంగళగిరి, న్యూస్‌టుడే : మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థలో పనిచేసే క్లాప్ ఆటోడ్రైవర్లు నిరవధిక సమ్మెకు దిగారు. ఈ మేరకు మంగళగిరిలోని నగరపాలక కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. రెండు నెలలు వేతనాలు చెల్లించాలని చాలీచాలని జీతాలతో ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనకు రవి, మణి, నాని తదితరులు నాయకత్వం వహించారు.

కొట్టి, బెదిరించారని కేసు నమోదు

యనమదల(ప్రత్తిపాడు): యనమదలలోని స్థలంలో ఇంటి నిర్మాణ పనులు చేస్తున్న తమపై నేలపాటి భాగ్యరాజు, కుటుంబ సభ్యులు దాడి చేసి, బెదిరించారని నేలపాటి మేరీమాత పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగేంద్ర తెలిపారు.

తెనాలి

•తెనాలి •పొన్నూరు


విజేతలకు బహుమతులు అందించిన ప్రిన్సిపల్ టి.వి.సుబ్రహ్మణ్యం, సమన్వయకర్త భానుప్రియ


పోటీలకు హాజరైన విద్యార్థులు

విరిసిన ప్రతిభ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి బుర్రిపాలెం రోడ్డులోని వెస్ట్‌బెర్రీ ఉన్నత పాఠశాలలో ఈనాడు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. 'అంతర్జాల వినియోగంలో లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పెద్ద సంఖ్యలో 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నారు. పదో తరగతి విద్యార్థులు సీహెచ్.బృందశ్రీ, కె.హర్షత్‌సాయిప్రసాద్, ఎస్.సాయిసంధ్య వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలువగా ప్రిన్సిపల్ టి.వి.సుబ్రహ్మణ్యం, సమన్వయకర్త భానుప్రియ విజేతలను అభినందించి బహుమతులు, ధ్రువపత్రాలు అందించారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన

పెదకాకాని: అపరాల సాగులో (మినుము, పెసర) సమగ్ర యాజమాన్య పద్ధతులను రైతులు అనుసరించాలని డీడీఏ వెంకటేశ్వర్లు తెలిపారు. పెదకాకాని గ్రామంలో అపరాల సాగుపై శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మినుము, పెసర పంటలపై పురుగు, తెగుళ్ల మందులు అధికంగా వాడుతుండడంతో పంటలో ఆకు మాడి గోధుమ రంగులో వస్తున్నట్లు ప్రయోగాత్మకంగా రైతులకు చూపారు. కృషి విజ్ఞాన కేంద్రం సిబ్బంది డాక్టర్ సీహెచ్ అనిల్, ఏవో సంధ్యారాణి పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

తెనాలి టౌన్: నూతన లైను ఏర్పాటు నేపథ్యంలో ఈనెల 26న పట్టణంలోని సుల్తానాబాద్, సుందరయ్యనగర్, ఆలపాటి నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈఈ లక్ష్మీనారాయణ శుక్రవారం తెలిపారు.

ప్రజలతో మమేకమవుదాం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: సమన్వయంతో సాగుతూ..సమస్యలు పరిష్కరించుకుంటూ..ప్రజలతో మమేకం అవుదామని తెనాలి నియోజకవర్గ తెదేపా బాధ్యులు, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. పట్టణంలోని కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గ తెదేపా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ నుంచి జరుగనున్న పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియలో ప్రతి నాయకుడు, కార్యకర్త క్రియాశీలకంగా వ్యవహరించాలని కోరారు. రూ.99తో సభ్యత్వ నమోదు వల్ల అందే బీమా ప్రయోజనాలు, శాశ్వత సభ్యత్వ నమోదు అంశాల గురించి వివరించారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని, ఇదొక ప్రయోగమని, రెండు జిల్లాల్లోని ప్రజాప్రతినిధులు, నాయకులతో సమన్వయంతో సాగుతున్నానని తెలిపారు. తెనాలి నియోజకవర్గంలోనూ ఇంకా సగానికి పైగా పట్టభద్రులు తమ ఓట్లు నమోదు చేసుకోలేదని, ఈ ప్రక్రియపై అవగాహన కలిగించి అర్హత ఉన్న వారందరినీ ఓటర్లుగా నమోదు చేయించాలని సూచించారు. తనకు ప్రతి దశలో అండగా నిలుస్తున్న నాయకులు, కార్యకర్తలకు సదా రుణపడి ఉంటానన్నారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, నాయకులు

ఏఎన్‌యూలో ముగిసిన కశ్మీరీ యువజన సమ్మేళనం


యువతకు ధ్రువపత్రం అందజేస్తున్న సహాయ కలెక్టర్ స్వప్నిల్ పవార్

ఏ.ఎన్‌.యు: ఆధునిక భారతదేశంలో కశ్మీరీ యువత పాత్ర కీలకమని గుంటూరు జిల్లా సహాయ కలెక్టర్ స్వప్నిల్ పవార్ అన్నారు. శుక్రవారం ఏఎన్‌యూలో కశ్మీరీ యువ సమ్మేళనానికి సహాయ కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో స్వప్నిల్ మాట్లాడుతూ.. దేశంలో వివిధ ప్రాంతాలలో జరుగుతున్న అభివృద్ధి, విద్య, ఉపాధి అవకాశాలు, సాంకేతిక మార్పులను కశ్మీరీ యువతకు తెలియజేసే ఉద్దేశంతోనే ఈ సమ్మేళనాన్ని నిర్వహించామన్నారు. ఈ పర్యటనను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ మాట్లాడుతూ ఇలాంటి సమ్మేళనాలు యువతను జాతీయ సమగ్రత, ఐక్యత, శాంతి ప్రతిపాదకులుగా తయారు చేస్తాయన్నారు. నెహ్రూ యువకేంద్రం రాష్ట్ర సంచాలకులు అంశుమన్ ప్రసాద్ మాట్లాడుతూ జమ్మూ కశ్మీర్ సంప్రదాయాలు, సంస్కృతి, ఆహార వ్యవహారాలు, ఆహార్య అలవాట్లు కశ్మీర్ యువకుల పరిచయం చేసేందుకు ఈ సమ్మేళనాన్ని నిర్వహించామన్నారు. యువత నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సమ్మేళనంలో పాల్గొన్న వారికి కలెక్టర్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. జిల్లా నెహ్రూ యువజన కేంద్రం అధికారిణి కిరణ్మయి, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త ఆచార్య దివ్యతేజోమూర్తి పాల్గొన్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలి

చేబ్రోలు, న్యూస్‌టుడే: అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసి గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ ఈ.కే.సాహితి అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖలపై సమీక్షించి ఆరా తీశారు. ఎంపీడీవో లలిత, తహసీల్దార్ శ్రీనివాస శర్మ, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కంటి మీద కునుకు కరవై..

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే

ప్రీ, పోస్టు మెట్రిక్ విద్యార్థుల ఎస్సీ, బీసీ వసతిగృహాల నిర్వహణ అధ్వానంగా ఉంది. ఇవి ఏళ్ల తరబడి నిధుల లేమితో కునారిల్లుతున్నాయి. అద్దె గృహాల్లో ఉండి చదువుకొనే ఆర్థిక స్తోమత లేని పేదింటి విద్యార్థులు శిథిలావస్థకు చేరి..దయనీయ స్థితిలో ఉన్న వసతిగృహాల్లో దుప్పట్లు లేక దోమకాటుతో కంటి మీద కునుకు లేక అల్లాడుతున్నారు. వీరికి తినడానికి పూర్తి స్థాయిలో పళ్లాలు, గ్లాసులు కూడా లేని పరిస్థితి. శుభ్రం చేయని మరుగుదొడ్లలో కాలకృత్యాలు తీర్చుకుంటూ విషమ పరీక్ష ఎదుర్కొంటున్నారు.


సుల్తానాబాదు అద్దె భవనంలోని బీసీ బాలుర కళాశాల వసతి గృహంలో గారపట్టిన మరుగుదొడ్డి

పళ్లాలు, గ్లాసులకూ కొరతే..: తెనాలి మండల, పట్టణ పరిధిలోని ఆరు ఎస్సీ, నాలుగు బీసీ వసతిగృహాల్లో మరుగుదొడ్లకు బిగించిన తలుపులు ఊడి పోయి అపరిశుభ్రంగా ఉన్నాయి. బోర్లు వేయించక చేతి పంపులే దిక్కయ్యాయి. కొందరికి మొక్కుబడిగా దుప్పట్లు, పళ్లాలు, గ్లాసులు ఇచ్చి మమ అనిపించారు. అన్నం ముద్దగా మారి గొంతు దిగడం లేదు. సుమారుగా ఆర్నెల్ల నుంచి మెస్, కాస్మోటిక్స్ ఛార్జీలు, భవనాల అద్దె చెల్లించడం లేదు. బహిరంగ మార్కెట్‌లో ధరలకు అనుగుణంగా లేని ఆహారపట్టికను అమలు చేయాలని వసతిగృహ సంక్షేమాధికారులు మెడ మీద కత్తి పెట్టడం గమనార్హం. ఖాళీలు భర్తీ చేయక ఉన్న వారిపై భారం మోపడంతో కష్టంగా మారింది.


తెనాలి: ఇంటి నుంచి ఒక విద్యార్థి తెచ్చుకున్న దోమ తెర


తెనాలి (కొత్తపేట): దుప్పట్లు లేకుండా నిద్రిస్తున్న చెంచుపేట కళాశాల బాలుర వసతిగృహ విద్యార్థులు

గదులు లేక..

చేబ్రోలులోని సాంఘిక సంక్షేమ వసతిగృహం అద్దె భవనంలో ఏర్పాటు చేశారు. ఇంజినీరింగ్, డిగ్రీ, డిప్లొమా విద్య అభ్యసిస్తున్న 33 మంది విద్యార్థులు ఉన్నారు. భవనం ముందు రేకులు, చుట్టూ గోడలతో ఏర్పాటు చేసిన రెండు వరండాల్లోనే 25 మంది విద్యార్థులు ఉంటున్నారు. గతేడాది అందజేసిన దుప్పట్లు, దోమ తెరలను వాడుకుంటున్నారు. వాస్తవానికి ఎనిమిది మరుగుదొడ్లు ఉన్నా అందులో నాలుగింటికి తలుపులు లేక ఉన్న వాటితోనే సరి పెట్టుకుంటున్నారు.

కటిక నేలపై.. చలికి గజగజ

న్యూస్‌టుడే, పొన్నూరు, చేబ్రోలు


పొన్నూరు: బీసీ వసతిగృహం ఆరు బయట పడుకున్న విద్యార్థులు

పట్టణ పరిధిలోని 19వ వార్డులో ప్రైవేటు భవనంలో ఏర్పాటు చేసిన కళాశాల వసతి గృహంలో ఉంటూ విద్యార్థులు పలు కళాశాలల్లో విద్యను అభ్యసించేవారు. వైకాపా హయాంలో గతేడాది వసతిగృహం అద్దె సకాలంలో చెల్లించకపోవడం, అలాగే విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నారని సాకు చూపి ఈ వసతిగృహాన్ని ఖాళీ చేయించి 2వ వార్డులోని ప్రీ మెట్రిక్ బాలుర వసతి గృహంలోకి విలీనం చేశారు. కళాశాల విద్యార్థులు 70 మంది, ప్రీ మెట్రిక్ విద్యార్థులు 30 మంది ఉన్నారు. గదులు సరిపోక రాత్రి సమయంలో చలికి ఆరు బయట నిద్రిస్తున్నారు. వసతిగృహం చుట్టూ పిచ్చి మొక్కలు ఉండడంతో ఎటు నుంచి ఏ విష కీటకాలు వస్తాయోనని భయపడుతున్నారు.

తలుపులు లేకపోవడంతో...

మండలంలోని పచ్చల తాడిపర్రు ఎస్టీ బాలుర వసతిగృహంలో 15 మంది విద్యార్థులు ఉన్నారు. వసతిగృహంలో నిర్మించిన కొన్ని మరుగుదొడ్ల తలుపులు విరిగిపోయాయి. తలుపులు ఏర్పాటు చేయమని గతంలో అనేక ప్రతిపాదనలు గత వైకాపా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా ఎటువంటి నిధులు మంజూరు చేయలేదు. తలుపులు లేకపోవడంతో లోపలికి వెళ్లేందుకు పిల్లలు నానా ఇబ్బందులు పడుతున్నారు. వసతిగృహం చుట్టూ నిర్మించిన ప్రహరీ గోడ కూలిపోయింది. గ్రామానికి శివారు ప్రాంతం కావడంతో విష కీటకాలు వస్తాయేమోనని విద్యార్థులు క్షణక్షణం భయపడుతున్నారు.


పొన్నూరు: తలుపులు లేని మరుగుదొడ్లు

చెత్త తొలగదు.. మురుగు కదలదు


పులగం వారి చెరువు వద్ద రోడ్డు అంచులో పేరుకుపోయిన చెత్త


జంగాలకాలనీలో మురుగు కాలువ దుస్థితి

పెదకాకాని, న్యూస్‌టుడే: అమరావతి నగరానికి కూతవేటు దూరంలో ఉన్న వెనిగండ్ల గ్రామంలోని ప్రజలు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. గుంటూరు ఛానల్ నుంచి విద్యుత్తు మోటార్ల ద్వారా నీటిని గ్రామంలోని చెరువులో నిల్వ చేస్తారు. ఈ చెరువు నీటిని ఫిల్టర్ చేసి గ్రామంలోని పంచాయతీ కుళాయిలకు సరఫరా చేస్తారు. చెరువులో నీరు పుష్కలంగా ఉన్నా రోజు మార్చి రోజు తాగునీరు సరఫరా చేస్తుండడంతో చాలడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ శివారులో ఉన్న పులగం వారి చెరువు, జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లే రోడ్డు పక్కన గ్రామంలో సేకరించిన చెత్తను పారిశుద్ధ్య కార్మికులు, గ్రామస్థులు వేస్తుండడంతో అటుగా రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు ముక్కు మూసుకొని పోయే పరిస్థితి ఉంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సక్రమంగా మురుగుకాల్వల్లో పూడికలు తీయడం లేదు. దీంతో కాలనీ వాసులు రోగాల బారిన పడుతున్నారు. రాత్రి వేళల్లో ఆయా కాలనీల్లో వీధి దీపాలు వెలగకపోవడంతో రాకపోకలప్పుడు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రామ జనాభా	: 10వేలు
కుళాయి సంఖ్య	: 1900
వీధి దీపాల సంఖ్య	: 600

సమస్యల వలయంలో సుందరయ్యకాలనీ.. కాలనీ ఏర్పడి సుమారు 14 ఏళ్లు అవుతోంది. ఇప్పటి వరకు సీసీ రోడ్లు లేవు. ప్రతి వీధిలో సుమారు ఇరవై ఇళ్లు ఉండగా వాటికి కుళాయిలు ఇవ్వలేదు. వీధికి రెండు పంచాయతీ కుళాయిలు మాత్రమే అధికారులు ఏర్పాటు చేశారు. రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. రాత్రివేళ వెలుతురు లేకపోవడంతో విష పురుగులు సంచరిస్తున్నాయి. ఇప్పటికైనా తమ కాలనీని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రణాళిక లేని పనులు

ఆర్‌ఆర్ నగర్ వాసుల ఇక్కట్లు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో పట్టణంలోని రావి రవీంద్రనాథ్ నగర్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయక వెక్కిరిస్తున్నాయి. ప్రణాళిక లేకుండా అభివృద్ధి పనులు చేపట్టడంతో సమస్యలు ఉత్పన్నమై ప్రజలు అల్లాడుతున్నారు. రావి రవీంద్రనాథ్‌నగర్‌కు మంజూరైన పట్టణ ఆరోగ్య కేంద్ర భవనాన్ని సమీపంలోని రాజీవ్ గృహ కల్పకు చెందిన మురుగుదొడ్ల వ్యర్థాలు సరఫరా అయ్యే పైపులపై నిర్మించడంతో అవి దెబ్బతిన్నాయని స్థానికులు పేర్కొన్నారు. అప్పటి నుంచి ఆ వ్యర్థాలను పక్కన కాలువల్లోకి వదులుతుండడంతో దుర్గంధం భరించలేక పోతున్నట్లు వాపోయారు. పశ్చిమ కాలువ, పరిమి కాలువలు నిండుగా ప్రవహించినంత కాలం పక్కా కాలువల్లో మురుగు ముందుకు కదలక స్తంభించి రోడ్ల పైకి చేరడం పరిపాటి అయిందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ బీటీ రోడ్లన్నీ గుంతలు పడి ప్రమాదకరంగా మారాయి. రెండో లైనులోని ప్రధాన తాగునీటి పైపులు లీకయినా మరమ్మతులు చేయకపోవడంతో తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం పొంచి ఉంది. రాజీవ్ గృహ కల్ప పథకం కింద నిర్మించిన ఇళ్లకు చెందిన సెప్టిక్ ట్యాంకుల్లో వ్యర్థాలు తోడే పనులు దక్కించుకున్న గుత్తేదారు పెట్టించిన రంధ్రాలపై కప్పు వేయక దుర్వాసన వ్యాపిస్తుందని జనం ఆవేదన వ్యక్తం చేశారు. వార్డు సచివాలయ వెలుపల పక్క రోడ్డులో తాగునీరు భారీగా పొంగి వృథా అవుతోంది. మరుగుదొడ్లు నిర్మించుకోని వారి కోసం నిర్మించిన వాటిలో వేసిన చేతి పంపులు ఆకతాయిలు పీక్కెళ్లారు. కొత్తవి వేయించక పోవడంతో కాలకృత్యాలు తీర్చుకునే వారు నీరు లభ్యం కాక ఇబ్బంది పడుతున్నట్లు స్థానికులు పేర్కొన్నారు. పక్కా కాలువలు నిర్మించక పోవడంతో మురుగు ఇళ్ల ముందు నిలిచి దోమకాటు పెరిగి పోయిందని వాపోతున్నారు.


కాలువల్లోకి మరుగుదొడ్ల వ్యర్థాల పైపులు


అసంపూర్తిగా పట్టణ ఆరోగ్య కేంద్ర భవనం

జనాభా:	12,065
కుటుంబాలు:	3,365
వార్డులు:	23, 24

ఉచిత వైద్యశిబిరం

కొల్లిపర, న్యూస్‌టుడే: ఫోర్‌ఫ్రంట్ ఛారిటీ ట్రస్టు సహకారంతో అన్నవరం గ్రామంలో తెలుగు యువత కార్యదర్శి నక్కాఅనీల్ పర్యవేక్షణలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీచేశారు. చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో నీటిపంపు ఏర్పాటుచేశారు. ట్రస్టు కన్వీనర్ నవీన్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల క్రమశిక్షణ.. లక్ష్యాలకు తొలిమెట్టు

గొడవర్రు (చేబ్రోలు): విద్యార్థులు క్రమశిక్షణతో లక్ష్యాలను అధిగమించాలని లాంప్ సంస్థ సమన్వయకర్త వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని గొడవర్రు ఎంపీయూపీ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు, స్థానికులకు మైఛాయిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణ, గృహహింసపై అవగాహన కల్పించారు. సంస్థ సభ్యులు బాజి, స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


జాతీయ పశుగణన ప్రచార గోడపత్రికను ఆవిష్కరించిన సబ్ కలెక్టర్, అధికారులు

పశు గణన ప్రక్రియ ప్రారంభం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: 21వ అఖిలభారత పశు గణన ప్రచార గోడ పత్రికను సంబంధిత విభాగ అధికారులతో కలిసి సబ్ కలెక్టర్ సంజన సింహ శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. శుక్రవారం నుంచి మొదలైన గణన ఫిబ్రవరి 28వ తేదీ వరకు కొనసాగుతుందని ఆమె వివరించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ పద్మావతి, సహాయ సంచాలకులు డాక్టర్ నాగిరెడ్డి, డాక్టర్ రమేష్, పశుమిత్ర నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరం: తెనాలి మండలం ఎరుకలపూడిలో శుక్రవారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని పశు వైద్యులు, అధికారులు పర్యవేక్షించారు. పసుపులేటి సామ్రాజ్యం, మురళీకృష్ణ, చందు శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు

పొన్నూరు, న్యూస్‌టుడే: పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టామని నీటి యాజమాన్య ప్రాజెక్టు డైరెక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. మండలంలోని మాచవరం గ్రామంలో శుక్రవారం పల్లె పండగ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. సిమెంటు రహదారులు, మురుగు కాల్వల నిర్మాణ పనులు చేపట్టడం ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. పెదపాలెం, పచ్చలతాడిపర్రు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు.

సహన కుటుంబాన్ని ఆదుకోవాలి

పొన్నూరు: తెనాలికి చెందిన సహన మృతిపై ఉపముఖ్యమంత్రి పవన కల్యాణ్ ఎందుకు స్పందించలేదని సీఐటీయూ మండల కార్యదర్శి నిమ్మాకూరి రమేశ్‌బాబు పేర్కొన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద శుక్రవారం సహన మృతికి కారణమైన నవీన్‌ను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఆందోళన చేశారు. సహన కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు.

మాతృ మరణంపై విచారణ

తెనాలి(కొత్తపేట): ఈ ఏడాది మేలో జిల్లా ఆసుపత్రిలో జరిగిన మాతృ మరణంపై జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ మజీద బేగం శుక్రవారం ప్రత్యేక విచారణ నిర్వహించారు. కొల్లిపర మండలంలోని ఓ గ్రామం నుంచి జిల్లా ఆసుపత్రి తల్లీపిల్లల విభాగానికి వచ్చిన గర్భిణికి గుర్రపువాతం వచ్చి ప్రసవం కష్టతరమవడంతో వైద్యులు జీజీహెచ్‌కు రిఫర్ చేయగా మార్గమధ్యలో మృతి చెందిన విషయం తెలిసిందే. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీసీహెచ్‌ఎస్ మజీదబేగం, వైద్యులు, సిబ్బందిని పిలిచి ప్రత్యేకంగా మాట్లాడారు. దస్త్రాలు పరిశీలించారు. అలాగే ముఖ ఆధారిత హాజరు నమోదులో అనుసరించాలిసిన నియమ నిబంధనలు గురించి వైద్యులు, సిబ్బందికి విశదీకరించారు. సమావేశంలో సూపరింటెండెంట్ సౌభాగ్యవాణి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై చైతన్యం

'ఈనాడు మీ తోడులో' కమిషనర్


పొన్నూరు, న్యూస్‌టుడే: పరిసరాలను పరిశుభ్ర పరిచే ప్రక్రియలో మహిళలు భాగస్వాములు కావాలని పురపాలక సంఘ కమిషనర్ రమేషుబాబు పేర్కొన్నారు. పట్టణ పరిధి 7వ వార్డు డీవీసీ కాలనీలో శుక్రవారం నిర్వహించిన ఈనాడు మీ తోడు కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని పరిసరాల శుభ్రతపై మహిళలకు అవగాహన కల్పించారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడగగా మహిళలు మాట్లాడుతూ.. పందుల సమస్య ఎక్కువగా ఉందని చెప్పడంతో కమిషనర్ జోక్యం చేసుకుని ఈ సమస్యను త్వరలోనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కాలనీలో ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరగడంతో పాములు వస్తున్నాయని మహిళలు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. కాలనీలో 230 వరకు ఖాళీ స్థలాలు ఉన్నట్లు గుర్తించామని, వారి వివరాలు సేకరించి తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.


చెత్తను తొలగించి బ్లీచింగ్ చల్లుతున్న కార్మికులు


డీవీసీ కాలనీలోని మహిళలతో మాట్లాడుతున్న కమిషనర్ రమేశ్‌బాబు

యువజనోత్సవాల సందడి

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరుగుతున్న యువజనోత్సవాలు తారస్థాయికి చేరుకున్నాయి. యువత సందడితో విశ్వవిద్యాలయంలో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. పాశ్చాత్య నృత్యాలతో యువత చిందేసింది. అబ్బుర పరిచే డ్యాన్స్‌లు, మట్టితో నమూనాలు, చిత్రలేఖనం, క్లాసిక్ వోకల్, గ్రూప్ సాంగ్స్, తదితర పోటీల్లో సత్తా చాటారు. ఏఎన్‌యూ ఆర్ట్స్ కళాశాలలోని థియేటర్ ఆర్ట్స్ విద్యార్థులు వేసిన రామాయణం నాటిక ఆకట్టుకుంది. విద్యార్థులు మట్టితో తయారు చేసిన నమూనాలు ఆకట్టుకున్నాయి.


రామాయణం నాటిక ప్రదర్శిస్తున్న థియేటర్ ఆర్ట్స్ విద్యార్థులు

కాలువలో పడి రైతు గల్లంతు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: కాలువలో పడి రైతు గల్లంతయిన ఘటన తెనాలి మండలం కొలకలూరులో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన 55 సంవత్సరాల ఏడుకొండలు సైకిల్‌పై కాలువ వెంట వెళుతూ ఉండగా.. ఎరువుల బస్తాలు జారి పడ్డాయి. ఆయన వాటిని తీసుకునే క్రమంలో జారి కాలువలో పడ్డారు. గ్రామీణ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అగ్నిమాపక కేంద్ర సిబ్బంది క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు.

జీవితంలో సవాళ్లను ఎదుర్కోవాలి

నంబూరు(పెదకాకాని): నంబూరు వీవీఐటీ విద్యార్థులు నిర్వహించిన 'టెడ్ ఎక్స్ వీవీఐటీ' స్ఫూర్తి, ప్రేరణ కలిగించే విధంగా ఉందని వీవీఐటీ ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. జీవితంలో సవాళ్లు ఎదురైనప్పుడు వాటిని అధిగమించాలన్నారు. ఈ కార్యక్రమంలో సినీ దర్శకుడు విద్యాధర్ కటిగ, లెంత్రా చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ అధికారి వికాస్ మెధోక్, న్యూరో సర్జన్ డాక్టర్ శివానంద్‌రెడ్డి, శాంసంగ్ సీనియర్ స్టాఫ్ ఇంజినీర్ శౌఘత భట్టాచటర్జీ, ఫోరెన్సిక్ ప్రొఫెషన్ త్రిషితా చటర్జీ, పర్యావరణ వేత్త ప్రొఫెసర్ డాక్టర్ అజయ్ కాట్రగడ్డ పాల్గొన్నారు.

చిన్నారులకు పోషకాహారం అందజేత

కొల్లిపర: అంగన్‌వాడీ చిన్నారులకు పోషకాహారంతో కూడిన చాకోస్ ప్యాకెట్లను శుక్రవారం అందచేసినట్లు ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు రాధిక తెలిపారు. కుమార్ పంప్స్ తోడ్పాటుతో 442 మంది చిన్నారులకు జాగృత భారత్ ట్రస్టు పోషకాహారం పంపిణీ చేశారని వెల్లడించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? పట్టణ పాండురంగపేటలో కుక్కల బెడద అధికంగా ఉంది. గుంపులుగా తిరుగుతూ వచ్చిపోయే వారి వెంట పడుతున్నాయి. భయపడుతున్నాం.- **స్థానికులు, పాండురంగపేట**

✔ సమస్య పరిష్కార చర్యలు తీసుకుంటాం.

? పట్టణ రామలింగేశ్వరపేట త్రిపురారి భట్ల వారి వీధిలోని గృహ సముదాయాల నుంచి ఆరు రోజులుగా చెత్త తీసుకెళ్లడం లేదు. సిబ్బంది ట్రాక్టర్లు రిపేరు అని చెబుతున్నారు.

- స్థానికులు, రామలింగేశ్వరపేట

✔ సత్వరం చెత్తను తరలిస్తాం. సమస్యపై స్థానిక సిబ్బందితో మాట్లాడతాం. **- పై ప్రశ్నలకు పురపాలక కమిషనర్ బి.శేషన్న సమాధానాలు ఇచ్చారు.**

చెట్ల కొమ్మలు తొలగింపు

స్పందనకు వందనం

పట్టణ మారీసుపేట రావి వారి వీధిలో విద్యుత్తు తీగలపైకి చెట్ల కొమ్మలు చేరాయని స్థానికులు 'ఈనాడు' ద్వారా ఈనెల 25న విద్యుత్తు అధికారులకు సమస్యను తెలియచేయగా వారు కొమ్మలను తొలగింపజేశారు. – న్యూస్‌టుడే, తెనాలి టౌన్

గుంటూరు పశ్చిమ

నేడు డయల్ యువర్ కార్పొరేషన్ కమిషనర్

ఈనాడు మీతోడు

నగరపాలకసంస్థ పరిధిలోని సమస్యలపై ఈనాడు ఆధ్వర్యంలో డయల్ యువర్ కార్పొరేషన్ కమిషనర్ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో పాల్గొని నగర ప్రజలు ప్రస్తావించే సమస్యలపై స్పందించడానికి కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు అంగీకరించారు. మీరు చేయాల్సిందల్లా ఈ కింది నంబరుకు ఫోన్ చేసి తాగు నీరు, పారిశుద్ధ్యం, రహదారుల గుంతలు, కాల్వల పూడికతీతలు, వీధిదీపాలు, వీధికుక్కలు తదితర సమస్యలను నేరుగా కమిషనర్ పులి శ్రీనివాసులు దృష్టికి తీసుకు రావొచ్చు. వీటి పరిష్కారంపై ఆయన స్పందిస్తారు. -న్యూస్‌టుడే, నగరపాలకసంస్థ


కమిషనర్ శ్రీనివాసులు

ఫోన్ చేయాల్సిన సమయం
శనివారం ఉదయం 11-12 గంటల వరకు
ఫోన్ నంబరు: 0863- 2224202

పోటీలతో ప్రతిభ వెలుగులోకి


ప్రతిభా పాటవ పోటీలకు హాజరైన విద్యార్థులు


విజేతలకు బహుమతులు అందజేసిన ప్రిన్సిపల్ మాలతి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: చంద్రమౌళీనగర్ మూడోలైను సాయి భగవాన్ నిలయంలోని భాష్యం పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీలకు విశేష స్పందన లభించింది. 'అంతర్జాలం వినియోగం వల్ల లాభనష్టాలు-విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశాలపై వ్యాసరచన పోటీలు శుక్రవారం నిర్వహించారు. జ్ఞానమై(తొమ్మిదో తరగతి) ప్రథమ, రోహిత్‌రామ్ ద్వితీయ, సాయిగీతిక(ఎనిమిదో తరగతి) తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు పాఠశాల ప్రిన్సిపల్ మాలతి, ఉపాధ్యాయులు వాసుదేవరావు, సుస్మిత తదితరులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు.

అర్హులందరికీ ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: సూపర్ సిక్స్ పథకాలు కచ్చితంగా అమలు చేస్తామని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి పేర్కొన్నారు. దీపావళి పండగ కానుకగా ఉచిత గ్యాస్ సిలిండర్ ప్రకటనతో మహిళల నుంచి పెద్ద ఎత్తున హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ సంపద సృష్టించడం చేతగాక జగన్ అయిదేళ్లు అస్తవ్యస్త పాలనతో ఖజానాను పూర్తిగా ఖాళీ చేసినా.. చంద్రబాబు పేదలకు ఇచ్చిన వాగ్దానం మేరకు పథకాలన్నింటినీ ఒక్కొక్కటీ నెరవేరుస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి మహిళకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలు చేస్తామన్నారు. చంద్రబాబు పాలనలో ఓవైపు పేదల సంక్షేమం, మరో వైపు రాష్ట్రం అభివృద్ధి చెందడం చూసి ఓర్వలేక జగన్‌రెడ్డి ప్రతి అంశాన్ని రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో తెలుగు మహిళా నాయకురాళ్లు దాసరి జ్యోతి, పంచుమర్తి కల్పన, నేపాక పద్మ, శ్రీవల్లి, నవమి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

పీవీకే నాయుడు మార్కెట్ వద్ద మౌలిక వసతులు కల్పించాలి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: పీవీకే నాయుడు మార్కెట్ వద్ద మౌలిక వసతులు కల్పించాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి అధికారులను ఆదేశించారు. పీవీకే నాయుడు కూరగాయల మార్కెట్‌ను ఆమె శుక్రవారం సందర్శించారు. మరుగుదొడ్లు సక్రమంగా లేవని, వర్షం వస్తే వరద నీరు మొత్తం నిలిచిపోతుందన్నారు. సమస్యల్ని పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, అందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సాధు రాజేష్, నిమ్మల రమణ, లాం వర్ధన్‌రావు, ఆళ్ల హరి, ఖర్జూర శ్రీను పాల్గొన్నారు.

శస్త్రచికిత్స విఫలమై వీధికుక్క మృతి.. కేసు నమోదు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: వీధికుక్కకు సక్రమంగా శస్త్రచికిత్స చేయకపోవడం వల్ల చనిపోయినందుకు అరండల్‌పేట ఠాణాలో కేసు నమోదైంది. బ్లూ క్రాస్ సొసైటీ సభ్యుడు సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాలివీ. వీధికుక్కల నియంత్రణలో భాగంగా నగరపాలక సంస్థ అధికారులు కు.ని శస్త్రచికిత్సలు చేస్తున్నారు. స్నేహ సంస్థకు ఈ బాధ్యతలు అప్పగించారు. ఇటీవల శ్రీనగర్ ప్రాంతానికి చెందిన వీధికుక్కకు ఆపరేషన్ చేయగా అది చనిపోయింది. ఇది స్థానికుల ద్వారా తెలుసుకున్న సురేష్ అరండల్‌పేట ఠాణాలో ఫిర్యాదు చేశారు.


బీఆర్ గార్డెన్స్ నాలుగో లైనులోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం ప్రహరీ కూలిపోయిందిలా


ఎల్ఈఎం పాఠశాల క్యాంపస్‌లోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహ ఆవరణలో అధ్వానంగా వసతిగృహ ప్రాంగణం


కిటికీలకు మెష్ లేకుండా..

సంక్షేమ వసతి గృహాల్లో సమస్యల కొలువు

నగరంలో వసతి గృహాలు: 12
విద్యార్థులు: 850 మంది

జిల్లాపరిషత్తు(గుంటూరు), పట్టాభిపురం, బ్రాడీపేట, ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: నగరంలోని సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలు కొలువై ఉన్నాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో సంక్షేమ హాస్టళ్ల నిర్వహణను గాలికి వదిలేయడంతో ఇప్పుడు కూడా అవే పరిస్థితులు కొనసాగుతున్నాయి. అరకొర సౌకర్యాలతోనే విద్యార్థులు కాలం వెళ్లదీస్తున్నారు. మరుగుదొడ్లు, స్నానపు గదులకు తలుపులు సరిగా ఉండని దుస్థితి. గత వారం రోజులుగా చలి తీవ్రత పెరగడంతో విద్యార్థులు గజగజలాడుతున్నారు. ప్రభుత్వం దుప్పట్లు పంపిణీ చేయకపోవడంతో ఇళ్ల వద్ద తెచ్చుకున్నవి కప్పుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలవుతోంది. సంక్షేమ శాఖల వసతి గృహాల్లో విద్యార్థుల సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు. 'న్యూస్‌టుడే' బృందం గురువారం రాత్రి 8 గంటలకు గుంటూరులోని సాంఘిక, బీసీ, గిరిజన సంక్షేమ శాఖల వసతి గృహాలను సందర్శించినపుడు ఎక్కువ మంది విద్యార్థులు దుప్పట్లు లేకుండానే నిద్రిస్తున్నారు. మరుగుదొడ్లకు తలుపులు కూడా లేని పరిస్థితి. వర్షాకాలం కావడంతో వసతి గృహ సముదాయంలో బురద, మురుగు చేరి పాచిపట్టింది. దీంతో దోమల బెడద అధికంగా ఉంది.

❖ బాలికల వసతి గృహాల్లో సమస్యలు బయటకు వెలుగు చూడడం లేదు

❖ లాడ్జికూడలిలోని ఎల్ఈఎం పాఠశాల క్యాంపస్‌లోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో గాలి సరిపోక అవస్థలు పడుతున్నారు.

❖ భవనానికి నెలకు రూ.78 వేలు అద్దె చెల్లిస్తున్నా కనీస వసతులు లేవు. వసతి గృహంలో కొన్ని కిటికీలు పగిలిపోయాయి. బోరుబావి నీటినే తాగుతున్నారు. ❖ బృందావన్ గార్డెన్స్ నాలుగో లైనులో సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం ప్రహరీ కూలిపోవడంతో రక్షణ లేకుండా పోయింది.


లాడ్జికూడలి: బాలుర వసతి గృహంలో తలుపు లేకుండా..


స్నానాల గదులదీ అదే దుస్థితి

అధ్వానంగా.. బాలుర కళాశాల వసతి గృహం

❖ ఏటీ అగ్రహారం 13వ లైన్ బాలుర కళాశాల వసతిగృహంలో నీటి సౌకర్యం లేక బయట నుంచి వాటర్ క్యాన్‌లు వార్డెన్ తెప్పిస్తున్నారు. బాతురూంలోకి నీరు కావాలన్నా విద్యార్థులే బయట నుంచి తీసుకొచ్చి ట్యాంకులో నింపుకోవాల్సిన పరిస్థితి. ఈ క్రమంలో ఆ ప్రాంతమంతా పాచి చేరింది. విద్యుత్తు మోటారు తీగలు చేతి అందే ఎత్తులో ఉండడంతో భయపడుతున్నారు. కళాశాల వసతి భవనం రెండో గేటు విరిగిపోయింది.



వంట గది తలుపు పరిస్థితి


పని చేయని ట్యాప్‌లు

27న అల్లూరి సీతారామరాజు నృత్య రూపక ప్రదర్శన

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: రోటరీ క్లబ్, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్, భారతీయ విద్యా భవన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 27న అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్ర నృత్య రూపకం ప్రదర్శించనున్నట్లు సమన్వయకర్త పి.రామచంద్రరాజు తెలిపారు. గుంటూరు కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. గుంటూరు శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సాయంత్రం 6 గంటలకు ప్రఖ్యాత నాట్య కళాకారిణి పద్మశ్రీ డాక్టర్ ఆనందశేఖర్ జయంత్ బృందం నృత్య రూపకాన్ని ప్రదర్శిస్తుందన్నారు. ప్రదర్శనకు అందరూ ఆహ్వానితులేనని, ప్రవేశం ఉచితమని చెప్పారు. ఉచిత పాస్‌లకు విజ్ఞాన మందిరం కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు. సమావేశంలో ఇంటాక్ సంస్థ రాష్ట్ర కన్వీనర్ ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రాలను రాజు, లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు.

సీనియర్ న్యాయవాది సీతారామదాస్ మృతి



గుంటూరు లీగల్, న్యూస్‌టుడే: గుంటూరు బార్ అసోసియేషన్‌కు చెందిన ప్రముఖ సీనియర్ న్యాయవాది మిక్కినేని సీతారామదాస్(93) శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. ఆయన బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, రెండు పర్యాయాలు ప్రభుత్వ న్యాయవాదిగా పని చేశారు. పెదనందిపాడు మండలం కొప్పర్రుకు చెందిన ఆయన గుంటూరులో ఆరు దశాబ్దాలకు పైగా న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. పలు సంస్థలకు న్యాయసలహాదారుగా వ్యవహరించారు. పలువురు నగర ప్రముఖులు, న్యాయవాదులు సంతాపం తెలిపారు. శనివారం ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

స్పందనకు వందనం

మురుగు తొలగింపు: బ్రాడీపేట సమీపంలోని హాలీవుడ్-బాలీవుడ్ ప్రాంతంలోని కాల్వలో మురుగు పేరుకుపోయింది. సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్ అంగడి బాబు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన పారిశుద్ధ్య సిబ్బందితో మురుగు తొలగింపజేయించారు.

కాలువల్లో పూడికతీత: లక్ష్మీపురం ప్రాంతంలోని పలు వీధుల్లోని మురుగు కాలువలు పూడుకుపోయాయి. సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్ అంగడి బాబు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన సిబ్బందిని పంపి పూడిక తీయించి సమస్య పరిష్కరించారు. -న్యూస్‌టుడే, బ్రాడీపేట

దశలవారీగా రహదారుల ఆక్రమణల తొలగింపు

నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: నగరంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా దశలవారీగా రహదారుల ఆక్రమణ తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ ఛాంబర్‌లో పట్టణ ప్రణాళిక అధికారులతో సమీక్ష నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఆక్రమణలు తొలగించాక తిరిగి పునరావృతం కాకుండా ప్రణాళిక కార్యదర్శులు, టీపీబీవోలు బాధ్యత తీసుకుని పర్యవేక్షించాలని ఆదేశించారు. బహుళ అంతస్తుల నిర్మాణాలకు ఇచ్చిన షార్ట్‌ఫాల్స్‌పై నవంబరు 15న నోటీసులు ఇవ్వాలని, స్పందించని వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆక్యుపెన్సీ ధ్రువపత్రం జారీ చేశాక కూడా నిబంధన ఉల్లంఘిస్తున్నారని, అటువంటి అనధికార నిర్మాణాలు పూర్తిగా తొలగించాలన్నారు. ఫంక్షన్ హాల్స్, మాల్స్, హోటల్స్ పార్కింగ్ సదుపాయం కల్పించుకోవాలని, రహదార్ల మీద పార్కింగ్ చేసే ప్రాంతాల్లో నోటీసులు ఇవ్వాలన్నారు. నగరంలో అనధికార బ్యానర్లు ఇష్టానుసారం ఏర్పాటు చేస్తుంటే దళం సభ్యులు ఏం చేస్తున్నారని అసహనం వ్యక్తంచేశారు. నగరంలో వెండింగ్ జోన్‌లు, పార్కింగ్ జోన్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సీపీ రాంబాబు, డీసీపీ సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

పశు గణనకు సహకరించండి


గోడపత్రిక ఆవిష్కరిస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా తదితరులు

జిల్లాపరిషత్తు: జిల్లాలో ఈనెల 28 నుంచి ప్రారంభించనున్న పశు గణనకు అందరూ సహకరించాలని జిల్లా పరిషత్తు ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. జడ్పీలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆమె పశు గణన పోస్టర్లు ఆవిష్కరించారు. పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకుడు కె.వి.వి.సత్యనారాయణ, పశు వైద్యాధికారి కె.శైలజ, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటిక ప్రదర్శనలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: అల్లు రామలింగయ్య నాటక కళాపరిషత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నాటక పోటీలు జరుగుతున్నాయి. అమరావతి ఆర్ట్స్ వారి చిగురు మేఘం నాటిక ప్రదర్శన శుక్రవారం జరిగింది. కావూరి సత్యనారాయణ రచనకు, యేపూరి హరి దర్శకత్వం వహించారు. అనంతరం గంగోత్రి పెదకాకాని వ్యవస్థాపకుడు నాయుడు గోపిని సన్మానించారు. తర్వాత ఎన్టీఆర్ జిల్లా వెలగలేరు ఆర్ట్స్ వారి నిశి నాటిక ప్రదర్శించారు. రచన, దర్శకత్వం పోలదాసు శ్రీను. సన్మాన కార్యక్రమంలో ఆరో డివిజన్ కార్పొరేటర్ పోతురాజు సమత, పోతురాజు చంద్రశేఖర్, చలనచిత్ర దర్శకులు కొండా రాంబాబు, మాదాసు మధు, పీవీకే నాయుడు, అధ్యక్షుడు వీరిశెట్టి లక్ష్మీనారాయణ, గేదెల రమేష్ పాల్గొన్నారు.


నాయుడు గోపిని సత్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

జగ్జీవన్‌రామ్ సినిమా పోస్టర్ ఆవిష్కరణ

అరండల్‌పేట, న్యూస్‌టుడే: జగ్జీవన్‌రామ్ సినిమా పోస్టర్‌ను ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అరండల్‌పేటలోని ఓ హోటల్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా దర్శకుడు దిలీప్‌రాజా మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ బయోపిక్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రవాస భారతీయుడు డాక్టర్ చందోలు నాగమల్లేశ్వరరావు చిత్రానికి నిర్మాతగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. వచ్చే నెల 9వ తేదీ నుంచి తెనాలిలో చిత్రీకరణ ఉంటుందన్నారు. సమర్పకుడు చందోలు దేవదాసు, సమన్వయకర్త కాలేబ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు


గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: టౌన్-2 సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్తు లైన్ల మరమ్మతులు చేస్తున్నందున ఈనెల 26న విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ గురవయ్య తెలిపారు. దీనివల్ల శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బృందావన్ గార్డెన్స్, రాజేంద్రనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

గుంటూరు తూర్పు

రత్నగిరినగర్‌లో తాగునీటి సరఫరాకు ఆదేశం

నగరపాలకసంస్థ: రత్నగిరినగర్‌లో తాగునీటి సమస్యపై ఈనాడులో శుక్రవారం వచ్చిన కథనాలకు కమిషనర్ శ్రీనివాసులు స్పందించారు. అక్కడ పర్యటించి స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. తక్షణం తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మోటర్ల మరమ్మతులు పూర్తవని పక్షంలో ట్యాంకర్లతో ప్రతి గృహానికి సరిపడా మంచినీరు అందించాలని ఆదేశించారు. కుళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు.

సీనియర్ న్యాయవాది సీతారామదాస్ మృతి


సీతారామదాస్ (పాతచిత్రం)

గుంటూరు లీగల్: గుంటూరు బార్ అసోసియేషన్‌కు చెందిన ప్రముఖ సీనియర్ న్యాయవాది మిక్కినేని సీతారామదాస్(93) శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. ఆయన బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, రెండు పర్యాయాలు ప్రభుత్వ న్యాయవాదిగా పనిచేశారు. పెదనందిపాడు మండలం కొప్పర్రుకు చెందిన ఆయన గుంటూరులో ఆరు దశాబ్దాలకు పైగా న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. పలు సంస్థలకు న్యాయసలహాదారుగా వ్యవహరించారు. పలువురు నగర ప్రముఖులు, న్యాయవాదులు సంతాపం తెలిపారు. శనివారం ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వాడవాడలా సీపీఐ జెండాలు ఆవిష్కరించండి

నెహ్రూనగర్: సీపీఐ శత వసంత ఉత్సవాలు జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జిల్లా నాయకుల సమావేశం నిర్వహించారు. సీపీఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు అయిన సందర్భంగా వాడవాడలా సీపీఐ జెండాలు ఆవిష్కరించాలన్నారు. సమావేశంలో నాయకులు మాల్యాద్రి, వెంకటరావు, సురేష్‌బాబు, అంజిబాబు, చిన్న పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు గడువులోగా పూర్తి చేయాలి

నగరపాలకసంస్థ: నగరంలో పనులను ఒప్పందమైన గుత్తేదారులు నిర్దేశిత సమయంలోగా పూర్తి చేసేలా ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని కమిషనర్ శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ వివిధ ప్రాంతాల్లో పర్యటించి అధికారులకు ఆదేశాలిచ్చారు. తర్వాత మల్లికార్జునపేటలో చెత్త పాయింట్ వద్ద అపరిశుభ్ర వాతావరణం ఉండటంతో స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్, పర్యావరణ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బొంగరాలబీడు శ్మశానవాటికలో 14వ ఆర్థిక సంఘం నిధులతో చేసిన గ్యాస్ దహనవాటిక పరిశీలించి వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. సంజీవయ్యనగర్ రైల్వే ట్రాక్ వద్ద ఆక్రమణలు తొలగించి విస్తరణ పనులు పూర్తి చేయాలన్నారు. గోరంట్లలో ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తులు చేసిన భవనాలు పరిశీలించి నిబంధనలు పాటించని వారికి అనుమతులు నిలిపివేయాలని సూచించారు.


ఇరుకైన గదుల్లో విద్యార్థులు


నేలపై కూర్చొని చదువుకుంటూ..


కింద డబ్బాలపైనే దుస్తులు, పుస్తకాల బ్యాగ్‌లు

అయిదేళ్లుగా.. దుప్పట్లు, రాత పుస్తకాల జాడ లేదు

పరిశీలన

వసతిగృహ విద్యార్థుల అవస్థలు

నెహ్రూనగర్ (గుంటూరు), న్యూస్‌టుడే : రాజాగారితోటలోని బీసీ సంక్షేమ బాలుర వసతి గృహంలో సుమారు వంద మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు అన్ని జిల్లాల నుంచి విద్యార్థులు వచ్చి ఇక్కడ ఉండి డిప్లొమో, ఇంటర్, డిగ్రీ, బీటెక్ చదువుకుంటున్నారు. గత అయిదేళ్లుగా వైకాపా ప్రభుత్వం వీరికి రాత పుస్తకాలు పంపిణీ చేసిన దాఖలా లేదు. చలికాలంలో కప్పుకోవడానికి కనీసం దుప్పట్లు ఇచ్చిన పాపాన పోలేదు. బహుళ అంతస్తుల అద్దె భవనంలో వసతిగృహం నిర్వహించడం విద్యార్థులకు పెద్దసమస్యగా మారింది. వ్యాపార సముదాయాల కోసం నిర్మించిన భవనంలో ఇరుకైన గదులు ఉండడంతో ఇక్కడ వసతి పొందుతున్న విద్యార్థులకు ఇబ్బందిగా ఉంది. చిన్నపాటి గదిలో నలుగురు నుంచి ఆరుగురు వరకు ఉంటున్నారు. గదులు ఇరుకుగా ఉండడంతో గాలి, వెలుతురు లేదు. దూరప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు తమ పుస్తకాలు, వస్త్రాలు, ఇతర వస్తువులు భద్రపరచుకోవడానికి సరైన వసతులు లేవు. ఆ ఇరుకైన గదిల్లోనే డబ్బాల్లో, గోడలకు మేకులు కొట్టుకొని వాటికి తాడు కట్టుకొని దుస్తులు వేలాడ తీసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

★ ఇక్కడ సంక్షేమాధికారి, వంటచేసే సిబ్బంది ఉన్నారు. మెనూ ప్రకారం ఆహారపదార్థాలు పెడుతున్నారు. లావు బియ్యంతో అన్నం సరిగా ఉండకపోవడంతో విద్యార్థులు కొంత ఇబ్బంది పడుతున్నారు. సన్నబియ్యంతో భోజనం అందిస్తే బాగుంటుందని కోరుతున్నారు.


గాలి, వెలుతురు కోసం సందులో ఇలా..

★ రాత్రి కాపలాదారు మూడు నెలల కిందట బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లారు. అప్పటి నుంచి ఇక్కడ రాత్రి కాపలాదారు లేరు. రాత్రి వేళల్లో వసతిగృహం వద్ద కాపలా ఎవరూ లేకపోవడంతో విద్యార్థుల భద్రత గాలిలోదీపంగా మారింది. అర్ధరాత్రి విద్యార్థులకు ఏదైనా అనారోగ్య సమస్య తలెత్తితే వారిని ఆసుపత్రులకు తీసుకువెళ్లడానికి, అత్యవసర పరిస్థితులకు ఉపయోగపడే వాచ్‌మెన్ లేకపోవడం సమస్యగా మారింది.

★ విద్యార్థులు నేలపైనే నిద్రించాల్సి ఉండటం, కనీసం వారికి దుప్పట్లు అందించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. చదువుకోటానికి కుర్చీలు లేక నేలపైనే కూర్చుంటున్నారు. ఒకరిద్దరు ఇళ్ల వద్ద నుంచి కుర్చీలు తెచ్చుకుంటున్నారు. కొంతకాలానికి అవికూడా పగిలిపోవడంతో ఇబ్బంది పడుతున్నారు.

★ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొద్ది నెలల కిందట ఎమ్మెల్యే నసీర్ ఆయాపార్టీల నాయకులు కలిసి వసతిగృహంలోని విద్యార్థులకు దోమతెరలు, రాత పుస్తకాలు అందజేయడంతో బాలురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నూతన విద్యావిధానం రద్దు చేయండి

నెహ్రూనగర్, న్యూస్‌టుడే : జాతీయ నూతన విద్యావిధానం-2020ను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి కోరారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా మహాసభ శుక్రవారం కొత్తపేటలోని కార్యాలయంలో నిర్వహించారు. మాజీ కార్యదర్శి అరుణ్‌కుమార్ ఏఐఎస్ఎఫ్ జెండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో శివారెడ్డి మాట్లాడుతూ నూతన వైద్యకళాశాలలు వద్దని ఎన్ఎంసీకి లేఖ రాయడం పేద విద్యార్థులను చదువులు దూరం చేయడమేనన్నారు. ఆ లేఖను వెనక్కి తీసుకోపోతే ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాశం వెంకటేష్, బందెల నాసర్‌జీ, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగరంలో విద్యార్థులు భారీ ప్రదర్శన నిర్వహించారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులు అరికట్టాలని డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, వేదికపై వెంకటేష్, నాసర్‌జీ తదితరులు



విద్యార్థులు, ఏఐఎస్ఎఫ్ నాయకుల ప్రదర్శన

నేడు డయల్ యువర్ కార్పొరేషన్ కమిషనర్

నగరపాలకసంస్థ పరిధిలోని సమస్యలపై ఈనాడు ఆధ్వర్యంలో డయల్ యువర్ కార్పొరేషన్ కమిషనర్ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో పాల్గొని నగర ప్రజలు ప్రస్తావించే సమస్యలపై స్పందించడానికి కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు అంగీకరించారు. మీరు చేయాల్సిందల్లా ఈ కింది నంబరుకు ఫోన్ చేసి తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారుల గుంతలు, కాల్వల పూడికతీతలు, వీధిదీపాలు, వీధికుక్కలు తదితర సమస్యలను నేరుగా కమిషనర్ పులి శ్రీనివాసులు దృష్టికి తీసుకురావొచ్చు. వీటి పరిష్కారంపై ఆయన స్పందిస్తారు.


కమిషనర్ శ్రీనివాసులు

ఈనాడు మీతోడు

-న్యూస్‌టుడే, నగరపాలకసంస్థ

ఫోన్ చేయాల్సిన సమయం: శనివారం ఉదయం 11 గంటల నుంచి 12 వరకు
ఫోన్ చేయాల్సిన నంబరు: 0863- 2224202

ప్రతిభ చాటారు



విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తున్న సెయింట్ లారెల్స్ ఇంగ్లిష్‌మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ మేకల రవీంద్రబాబు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే : ఆర్టీసీ కాలనీలోని సెయింట్ లారెల్స్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో శుక్రవారం ఈనాడు ఆధ్వర్యంలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీ పరీక్షలు జరిగాయి. 'ఇంటర్నెట్ వినియోగంతో లాభనష్టాలు-విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎస్‌కె సోనియా, ఎం.శారదా శ్రీశర్వాణి, ఎస్‌కె అర్షద్‌లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు హైస్కూల్ కరస్పాండెంట్ మేకల రవీంద్రబాబు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అండ్ డైరెక్టర్ మేకల సాయి శ్రీకర్, ఉపాధ్యాయులు లక్ష్మి, గాయత్రి, కిరణ్మయి పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న విశ్వజ్యోతి పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ బండి జేమ్స్

పట్నంబజారు, న్యూస్‌టుడే: ఐపీడీ కాలనీలోని విశ్వజ్యోతి పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగంతో కలిగే లాభనష్టాలు - విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అంశంపై జరిగిన వ్యాసరచన పోటీల్లో వి.సాయిస్రుజన్, బి.సాయి తులసి, పి.యామినిలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను స్కూల్ డైరెక్టర్ బండి జేమ్స్ అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు షేక్ ఫజనా, బి.ప్రమిల జ్యోతి, బి.కార్తీక్, కె.వి.మహేష్‌బాబు, బి.ప్రకాష్‌లు పాల్గొన్నారు.

మరమ్మతు పనులు ప్రారంభం

ఈనాడు కథనానికి స్పందన

పట్నంబజారు, న్యూస్‌టుడే: నందివెలుగు రోడ్డులో తవ్వకాలు చేసిన ప్రాంతంలో గురువారం అధికారులు సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ నెల 24న 'ఈనాడు'లో ప్రచురితమైన 'అధికారుల నిర్లక్ష్యం.. వాహనదారులకు శాపం' కథనానికి అధికారులు స్పందించారు. దాదాపు నెలరోజుల కిందట తవ్వి వదిలిలేసిన ప్రాంతంలో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. రూ.4లక్షల వ్యయంతో గాంధీబొమ్మ సెంటర్ నుంచి మణిహోటల్ సెంటర్ వరకు ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ప్యాచ్‌వర్క్ పనులు జరుగుతున్న కారణంగా ట్రాఫిక్‌ను ఒక వైపు నిలిపివేసి వన్‌వే మార్గంలో రాకపోకలు కొనసాగించే విధంగా చర్యలు తీసుకున్నామని అధికారులు తెలిపారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు


వ్యాసరచన పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లాలోని పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. పోలీసుస్టేషన్ సందర్శించిన విద్యార్థులకు విభాగాలు, అధికారుల పనితీరు వివరించారు. పలు పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

వస్త్ర దుకాణంలో చోరీ

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: వస్త్రదుకాణంలో చోరీ ఘటనపై శుక్రవారం కొత్తపేట పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కొత్తపేట ప్రభుత్వ మహిళా కళాశాలరోడ్డులో మైస్టయిల్ రెడీమేడ్ షోరూం నిర్వాహకులు గురువారం రాత్రి తాళాలు వేసుకొని వెళ్లారు. శుక్రవారం ఉదయం వచ్చి చూడగా షాపు షట్టర్ తాళాలు పగలకొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూస్తే రూ.2 లక్షల విలువ చేసే వస్త్రాలు చోరీకి గురయ్యాయని యజమాని అశోక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వీరయ్య తెలిపారు.

మహిళ అదృశ్యం

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: మహిళ అదృశ్యంపై శుక్రవారం నగరంపాలెం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు..శ్రీనివాసరావుపేటకు చెందిన మాధవిని ఆమె కుమారుడు వినయ్ ఖర్చులకు డబ్బులు ఇవ్వాలని అడిగాడు. తన వద్ద డబ్బులు లేవన్నా వినకుండా ఇబ్బంది పెట్టడంతో ఆమె ఈనెల 21వ తేదీ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తన తల్లి కనిపించడంలేదని వినయ్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వీరానాయక్ తెలిపారు.

అర్హులందరికీ ఉచిత గ్యాస్ సిలిండర్: ఎమ్మెల్యే నసీర్


పోస్టర్లు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ తదితరులు

ఎన్టీఆర్ సర్కిల్,న్యూస్‌టుడే: దీపావళి కానుకగా ఆరోజు అర్హులైన ప్రతి ఒక్కరి ఇంటికి ఉచితంగా గ్యాస్ సిలిండర్ సీఎం చంద్రబాబు పంపుతున్నారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ పేర్కొన్నారు. సూపర్-6 భాగంగా ఈనెల 31 నుంచి మహిళలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్ల పథకం ప్రారంభించనున్న నేపథ్యంలో బస్టాండ్ సెంటర్‌లో ఎన్టీఆర్ సర్కిల్ వద్ద థాంక్యూ సీఎం సర్ అంటూ టపాసులు కాల్చి మిఠాయిలు తినిపించుకుంటూ సంబరాలు నిర్వహించారు.

లొకేషన్ ఫొటో పంపితే.. గమ్యానికి డ్రగ్స్!

సూడాన్ దేశస్థుడు సహా ముగ్గురి అరెస్టు

ఈనాడు, హైదరాబాద్: పోలీసులకు చిక్కకుండా.. తమ ఆనవాళ్లు గుర్తించకుండా డెడ్‌డ్రాప్ పద్ధతిలో సింథటిక్ డ్రగ్స్ చేరవేస్తున్న అంతర్జాతీయ ముఠాలోని ఒక విదేశీయుడు సహా ముగ్గురిని రెండు వేర్వేరు కేసుల్లో హైదరాబాద్ పోలీసులు అరెస్టుచేశారు. రూ.20.75 లక్షల విలువైన మాదకద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నారు. బంజారాహిల్స్ పోలీస్ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో శుక్రవారం నగర సీపీ సీవీ ఆనంద్ మీడియాకు వివరాలు వెల్లడించారు. సూడాన్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ రెహ్మాన్ ఉస్మాన్ అలియాస్ హనిన్(24) విద్యార్థి వీసాపై వచ్చి..హైదరాబాద్ టోలిచౌకికి చేరాడు. అంతర్జాతీయ డ్రగ్ రాకెట్ నుంచి తక్కువ ధరకు సింథటిక్ డ్రగ్స్ కొని నగరంలో సరఫరా ప్రారంభించాడు. కొనుగోలుదారుల నుంచి నగదు ఖాతాలో పడగానే వారికి డ్రగ్స్ ఉంచిన ప్రాంతం ఫొటో, లొకేషన్ పంపి డెడ్‌డ్రాప్ పద్ధతిలో సరకు చేరవేసేవాడు. సూడాన్‌కు చెందిన కుర్బా నుంచి హనిన్‌కు డ్రగ్స్ చేరుతున్నట్టు పోలీసులు గుర్తించారు. విదేశీ నిందితుడి నుంచి 50 గ్రాముల ఎండీఎంఏ, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

➠ బంజారాహిల్స్ నివాసి ఇమ్రాన్ అలియాస్ షకూర్(29) ఐదో తరగతిలోనే గంజాయికి అలవాటై చదువు మానేశాడు. సింథటిక్ డ్రగ్స్ కొని నగరంలో విక్రయించసాగాడు. చందానగర్‌కు చెందిన కె.నవీన్(24)ను ఏజెంట్‌గా ఏర్పాటుచేసుకొని డెడ్‌డ్రాప్ పద్ధతిలో సరకు తరలిస్తున్నాడు. ఇతను జులైలో మకాం టోలిచౌకికి మార్చి కొనుగోలుదారులకు ఏజెంట్ ద్వారా అందజేస్తున్నాడు. ఇమ్రాన్ ఫోన్‌లో 11 మంది కొనుగోలుదారులను పోలీసులను గుర్తించారు. వీరిలో ఒకరు గుంటూరు వ్యక్తి ఉన్నట్టు నిర్ధారించారు. ఇతడి ద్వారా ఏపీలోని పలు ప్రాంతాలకు సింథటిక్ డ్రగ్స్ చేరుతున్నట్టు అంచనాకు వచ్చారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
94406 38515, 80085 73097

స్పందనకు వందనం

జిన్నాటవర్ సెంటర్‌లో అధ్వానంగా మారిన రోడ్డుకు అధికారులు మరమ్మతులు చేశారు. ఈ ప్రాంతంలో గుంతలమయమైన రోడ్డు గురించి స్థానికుల నుంచి మేమున్నాం..మీకుతోడుగాకు వచ్చిన ఫిర్యాదుల్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా, వారు స్పందించి మరమ్మతులు చేయించారు.

★ ఎన్టీఆర్ కూడలిలో రోడ్లపై వ్యర్థాల్ని శుక్రవారం అధికారులు తొలగించారు. వ్యర్థాలు తొలగించడం లేదని స్థానికుల నుంచి మేమున్నాం..మీకుతోడుగాకు ఫిర్యాదులు అందాయి. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా, వారు స్పందించి వ్యర్థాలను తొలగింపజేశారు. – న్యూస్‌టుడే, పట్నంబజారు

ఎస్సీ వర్గీకరణ అమలుపై సీఎం చంద్రబాబు స్పందించాలి

❖ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



మాట్లాడుతున్న మంద కృష్ణ, పక్కన జాతీయ అధ్యక్షుడు నాగరాజు, రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ తదితరులు

గుంటూరు(అరండల్‌పేట), న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణను 2000 సంవత్సరంలో ఏపీలో అమలుచేసి దేశంలోని అన్ని రాష్ట్రాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదర్శంగా నిలిచారని, ప్రస్తుతం ఏపీలో అమలు చేయడానికి ఎందుకు ఆలస్యమవుతుందో తెలియడం లేదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ తెలిపారు. గుంటూరులో శుక్రవారం మంద కృష్ణమాదిగ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలుపై సీఎం చంద్రబాబు వెంటనే స్పందించాలని విజ్ఞప్తి చేశారు. 2000లో వర్గీకరణ అమలు చేయడంతో మాదిగలు, ఉపకులాలు అనేక విధాలుగా బాగుపడ్డాయన్నారు. వర్గీకరణ అంశంపై సుప్రీకోర్టులో వాదించేందుకు ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు న్యాయవాదులను ఏర్పాటు చేసిందని, జగన్ సీఎంగా ఉండగా.. న్యాయవాదిని సైతం ఏర్పాటు చేయలేదన్నారు. తొలి నుంచి వర్గీకరణకు చంద్రబాబు అనుకూలంగా వ్యవహరిస్తున్నందునే.. కూటమి ప్రభుత్వానికి ఎమ్మార్పీఎస్ ఈ ఎన్నికల్లో సంపూర్ణ మద్దతు ఇచ్చి విజయానికి కృషి చేసిందన్నారు. రాష్ట్రంలో వర్గీకరణ అమలు చేయకుండా ఎలాంటి నోటిఫికేషన్లు ఇవ్వకూడదన్నారు. రాష్ట్రంలో వర్గీకరణను ముఖ్యమంత్రి చంద్రబాబు తప్పకుండా అమలు చేస్తారనే నమ్మకం ఉందని, దీనిపై మాట్లాడేందుకు ఈ వారంలో ఆయన అపాయింట్‌మెంట్ కోరతామన్నారు. నవంబర్ 1 నుంచి అన్ని జిల్లాల్లో సమావేశాలు నిర్వహిస్తామని, అనంతరం భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు నాగరాజుమాదిగ, రాష్ట్ర అధ్యక్షుడు సురేష్‌మాదిగ, రాష్ట్ర మీడియా కన్వీనర్ చిలకా సాంబయ్యమాదిగ, జిల్లా అధ్యక్షుడు సుధీర్, వేశపోగు దయాకర్, కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణకు అండగా నిలిచిన చంద్రబాబుకు కృతజ్ఞతలు



లాడ్జికూడలిలో మాదిగల కృతజ్ఞతా యాత్ర

బ్రాడీపేట, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణకు అండగా ఉండడమే కాకుండా గతంలో ఎన్నడూ లేని విధంగా రాజకీయ ప్రాధాన్యం కల్పించిన సీఎం చంద్రబాబుకు మాదిగలు రుణపడి ఉంటారని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ అన్నారు. గుంటూరు లాడ్జికూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్దకు మాదిగల కృతజ్ఞతాయాత్ర శుక్రవారం చేరుకుంది. ముందుగా ఫ్లెక్సీలు పట్టుకొని చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ నినదించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాదిగ మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో మాదిగలకు 15 శాసనసభ స్థానాలు కేటాయించగా.. అందులో 13 మంది గెలుపొందారని, మాదిగల అభ్యున్నతికి, వారికి రాజకీయ ప్రాధాన్యం పెంచిన ఘనత చంద్రబాబుదేనని కొనియాడారు. ఆగస్టు 16న హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు 'మాదిగల కృతజ్ఞతా యాత్ర' చేపట్టగా.. నేడు గుంటూరుకు చేరిందన్నారు. త్వరలోనే రాజధాని ప్రాంతంలో పెద్ద ఎత్తున కృతజ్ఞతాయాత్ర సభను నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నవ్య మాదిగ చర్మకారుల సంఘం వేజండ్ల సుబ్బారావు, కె. వెంకట్రావు, అశోక్, బసవరాజు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

పట్నంబజారు, న్యూస్‌టుడే: కార్తిక మాసం పురస్కరించుకొని నవంబరు 2వ తేదీ నుంచి శైవ క్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి రవికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. శైవ క్షేత్రాలైన సామర్లకోట, ద్రాక్షారామం, భీమవరం, అమరావతికి బస్సులు నడపనున్నట్లు వెల్లడించారు. త్రిశైవ క్షేత్రాలైన యాగంటి, మహానంది, శ్రీశైలంలను ఒకేరోజులో దర్శించుకొనేందుకు ప్రతి శని, ఆదివారం రాత్రి బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. టిక్కెట్లను ఆన్‌లైన్‌లో పొందాలన్నారు. అయ్యప్ప స్వాములు శబరిమలకు వెళ్లేందుకు తక్కువ ఛార్జీతో ఆర్టీసీ బస్సులు నడపనున్నట్లు తెలిపారు. మండల పూజ, మకర జ్యోతి దర్శనానికి అద్దె ప్రాతిపదికన బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. పంచారామ దర్శనానికి ఎక్స్‌ప్రెస్‌లు, ఆల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

అందరూ అక్కడే.. అవినీతికి దారులే..!

నగరపాలకసంస్థ, పట్టాభిపురం, న్యూస్‌టుడే

గుంటూరు నగరంలో జనాభా పెరుగుతుండటంతో పాటు నివాస ప్రాంతాలు విస్తరిస్తున్నాయి. అందుకు తగినట్లు ప్రజలకు సేవలందించాల్సిన నగరపాలక సంస్థ పన్నులు విధించడం వరకే పరిమితమైంది. వేలాది మంది ఉద్యోగులు, సిబ్బంది ఉన్నప్పటికీ నగరవాసులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతున్నారు. గుంటూరు తూర్పులో నగరపాలక సంస్థ కార్యాలయం ఉంది. పశ్చిమలో సర్కిల్ కార్యాలయం ఏర్పాటు చేసి రెండు దశాబ్దాలు దాటినా పాలన వికేంద్రీకరణ జరగకపోవడం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది కొసరు పనులే ఎక్కువగా చేస్తున్నారు. దీర్ఘకాలంగా అదే సీట్లలో కొనసాగుతూ అక్రమాలు, అవినీతి వ్యవహారాలకు అన్నీ తామై వ్యవహరిస్తూ కొందరు ఒప్పంద ఉద్యోగులు చక్రం తిప్పుతున్నారు.



దీర్ఘ కాలికంగా ఒకే సీటులో..

ఏళ్ల తరబడి ఒకే పోస్టులో కొనసాగుతున్న నగరపాలక సంస్థ ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, పారిశుద్ధ్య విభాగాల్లో పని చేస్తున్న ఒప్పంద ఉద్యోగులు, కార్మికులు.. అధికారుల అక్రమ వ్యవహారాలకు సహకరిస్తూ అందిన కాడికి దండుకుంటున్నారు. మూడేళ్ల క్రితం జీఎంసీ పాలకవర్గం పగ్గాలు వైకాపా చేపట్టాక ఇవి పెచ్చుమీరాయి. ఒప్పంద ఉద్యోగుల కార్పొరేషన్(ఆప్కాస్)లోకి పదుల సంఖ్యలో ఉద్యోగులను అక్రమంగా నియమించడంతో అప్పట్లో కౌన్సిల్ సమావేశంలో రచ్చ జరిగింది.

విభాగాల వారీగా ఇలా..

వివిధ విభాగాల్లో కంప్యూటర్ ఆపరేటర్లుగా 56 మంది, అటెండర్లు 91, సెక్యూరిటీ సిబ్బందిగా 54 మంది ఉన్నారు. ఇంజినీరింగ్ విభాగంలో వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది వెయ్యి మంది, పట్టణ ప్రణాళికలో దళం, ఇతర సిబ్బంది వంద మందికి పైగా, పారిశుద్ధ్య విభాగంలో 2,200 మంది వరకు ఒప్పంద కార్మికులు పని చేస్తున్నారు.. ఇంత మంది సిబ్బంది ఉన్నా వీరంతా ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారనే అంశం ప్రశ్నార్థకంగా మారింది.

నగరపాలక సంస్థ, సర్కిల్ కార్యాలయ వివరాలివి..

- నగర జనాభా: 10 లక్షలకు పైగా
- మొత్తం డివిజన్లు : 57
- ప్రధాన కార్యాలయంలో రెగ్యులర్ ఉద్యోగులు: 4,000 మంది
- ఒప్పంద ఉద్యోగులు: 3,000
- సర్కిల్ కార్యాలయంలో : 20 మంది

ఉపాసెల్, పట్టణ ప్రణాళిక, కమిషనర్ ఛాంబర్ వంటి విభాగాల్లో ఒప్పంద సిబ్బంది ఒకే సీటుకు పరిమితమై.. అధికారులు చేసే తప్పులకు సహకరిస్తూ వారి వద్ద ఉండే 'డిజిటల్ కీ' కూడా వినియోగిస్తున్నారన్న విమర్శలున్నాయి. పారిశుద్ధ్య విభాగం, ఇంజినీరింగ్ విభాగంలో చేసే ఇద్దరు ఒప్పంద కార్మికులు, నగరంలో ఇంజినీరింగ్ విభాగంలో వర్క్‌ఇన్‌స్పెక్టర్లు, ఫిట్టర్లు, ట్యాప్ ఇన్‌స్పెక్టర్లు దీర్ఘకాలంగా కొనసాగుతున్నారు.

అక్రమాల కోసమే ఒప్పంద ఉద్యోగులు

సర్కిల్ కార్యాలయం ఉన్నా..

గుంటూరు పశ్చిమ ప్రజలకు మెరుగైన సేవలందించాలన్న లక్ష్యంతో బృందావన్ గార్డెన్స్ ప్రధాన రహదారిలో నగరపాలక సంస్థ సర్కిల్ కార్యాలయం ఏర్పాటు చేశారు. మొదట్లో డిప్యూటీ కమిషనర్, కొందరు ఉద్యోగులు ఇక్కడ సేవలందించేవారు. అయిదేళ్లుగా ఆ పరిస్థితి లేదు. సచివాలయాల ఉద్యోగులపై అజమాయిషీ లేకపోవడంతో వారి ఇష్టారాజ్యమై పోయింది. స్వయంగా ఎమ్మెల్యే గళ్లా మాధవి ఉద్యోగుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార పార్టీ నేతలు, కమిషనర్ ఈ విషయంపై దృష్టి సారించి సర్కిల్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైకాపా పాలకవర్గం వచ్చాక పెరిగిన ఆగడాలు..

2021లో వైకాపా పాలకవర్గం ఏర్పడ్డాక జీఎంసీలో ప్రొటోకాల్ పేరుతో, ప్రజాప్రతినిధుల ఛాంబర్లలో సిబ్బంది అవసరమంటూ పదుల సంఖ్యలో ఒప్పంద ఉద్యోగులను నియమించుకున్నారు. ఇలా నియమించిన కొందరు అసలు ఎక్కడ ఏ విభాగాల్లో పని చేస్తున్నారో కూడా తెలియని పరిస్థితి. ఎన్నికల కోడ్ వచ్చినా కొందరు నాయకులు వీరిని వెంటే తిప్పుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలైనా అక్రమంగా నియమితులైన వారిపై చర్యలు తీసుకోలేదు.

27న అఖిల భారత యాదవ మహాసభ

అరండల్‌పేట, న్యూస్‌టుడే: ఈనెల 27న గుంటూరులో అఖిల భారత యాదవ మహాసభ నిర్వహించనున్నట్లు మహాసభ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు నాగమల్లేశ్వరియాదవ్ తెలిపారు. అరండల్‌పేటలోని కార్యాలయంలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. యాదవులను ఐక్యతపర్చి అభివృద్ధి పథంలో నడపడమే లక్ష్యంగా అరండల్‌పేటలోని వైన్ డీలర్స్ కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు జోనల్ సభ ఏర్పాటు చేశామన్నారు. విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో కూడా యాదవులను ముందుకు తీసుకువెళ్లటమే ధ్యేయంగా మహాసభ పనిచేస్తుందన్నారు. మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఆవుల వీరశేఖర్ యాదవ్ ఎన్నికయ్యారు.

అమరావతి రైల్వేలైన్‌పై రాజధాని రైతుల హర్షం

❖ మిఠాయిల పంపిణీ



కేకు కోస్తున్న రాజధాని మహిళలు, రైతులు

తుళ్లూరు, న్యూస్‌టుడే : ప్రజా రాజధాని అమరావతికి రైల్వే లైను నిర్మాణానికి కేంద్రం పచ్చ జెండా ఊపడంతో రాజధాని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం గుంటూరు జిల్లా తుళ్లూరులో మహిళలు, రైతులు కేకులు కోసి మిఠాయిలు పంచారు. జై మోదీ, జై చంద్రబాబు, జై పవన్ కల్యాణ్, జై అమరావతి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేయనున్న 57 కిలోమీటర్ల రైలు మార్గంతో దేశంలోని వివిధ ప్రాంతాలకు అనుసంధానం ఏర్పడుతుందన్నారు. నేతలకు ధన్యవాదాలు తెలిపారు.

27 నుంచి సీడీఈ పరీక్షలు

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని దూర విద్యా కేంద్రంలో ఈనెల 27 నుంచి యూజీ, పీజీ పరీక్షలు నిర్వహించనున్నారు. డిగ్రీ కోర్సులకు 44వేల మంది, పీజీ, డిప్లొమా కోర్సుల్లో 15,300 మంది పరీక్షలు రాయనున్నారని సమన్వయకర్త డాక్టర్ రామచంద్రన్ చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 144 కేంద్రాలలో పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రత్యేక పరిశీలకులను, ప్రాంతీయ సమన్వయకర్తలను నియమించారు.

వరద బాధితులకు రూ.40లక్షల దుస్తుల పంపిణీ



ఇబ్రహీంపట్నంలో దుస్తులు పంపిణీ చేస్తున్న విజ్ఞాన్ అధ్యాపకులు

పొన్నూరు, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని కొటికలపూడి గ్రామంలోని 3వేల మంది వరద బాధితులకు వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సుమారు రూ.40లక్షల విలువ చేసే దుస్తులను అందజేసినట్లు ఉపకులపతి పి.నాగభూషణ్ శుక్రవారం వెల్లడించారు. బాధితులకు అందజేసిన కిట్లలో చీర, పంచె, రెండు టవళ్లు, ఒక దుప్పటి ఉన్నట్లు తెలిపారు. వరద సహాయక చర్యల్లో పాల్గొన్న విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

ఏఎన్‌యూలో ఎన్ఐఆర్ఎఫ్ కమిటీ పర్యటన

ఎ.ఎన్.యు, న్యూస్‌టుడే: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమింగ్ కమిటీ సభ్యులు శుక్రవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పర్యటించారు. కమిటీ సభ్యులు న్యాక్ సలహా మండలి మాజీ సభ్యురాలు రమా కొండపల్లి, దిల్లీ జమా ఇస్లామియా విశ్వవిద్యాలయం ఆచార్యులు జుబేదా అన్సారీ, అమృత విద్యా సంస్థల ఐక్యూఏసీ సంచాలకులు ప్రశాంత్ నాయర్ వీసీ కార్యాలయంలో ముఖ్యమైన అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం డీన్స్, ప్రిన్సిపల్స్, విభాగాధిపతులు, బోధనేతర సిబ్బందితో మాట్లాడారు. అత్యున్నత ర్యాంకు సాధనకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలను అధికారులకు వివరించారు. విశ్వవిద్యాలయంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, కోర్సుల వివరాలను ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్ కమిటీ సభ్యులకు వివరించారు. ఏఎన్‌యూలోని వివిధ విభాగాలను శనివారం సందర్శించనున్నారు.



ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్‌తో సమావేశమైన కమిటీ సభ్యులు

దాతలు ముందుకొచ్చినా వినియోగించుకోలేరా?

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే



అసంపూర్తిగా జీజీహెచ్ సర్వీస్ బ్లాక్ నిర్మాణం

సర్వజనాసుపత్రిలో అత్యంత ప్రాధాన్యం ఉన్న భవనాల్లో సర్వీస్‌బ్లాక్ ఒకటి. అందువల్లే తెదేపా అధికారంలో ఉన్నపుడే 2015లోనే ఈ భవనానికి రూ.10 కోట్లు మంజూరు చేసింది. కొంత మేరకు పనులు చేసింది. వైకాపా అధికారంలోకి వచ్చాక ఆ పనుల గురించి పట్టించుకోలేదు. దీంతో ఆ బహుళ అంతస్తుల భవనం పనులు పూర్తి చేయలేకపోయారు. దీంతో తులసి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత తులసి రామచంద్రప్రభు ఆ భవనం నిర్మాణానికి రూ.5 కోట్లు ఇచ్చేందుకు ముందుకొచ్చారు. ఆ నిధులతో తానే పనులు చేసి ప్రభుత్వానికి అప్పగిస్తానని హామీ ఇచ్చారు. నెల రోజులు గడిచినప్పటికీ అధికారుల నుంచి స్పందన కరవైంది.

బడ్జెట్ ఉంటేనే పనులు చేస్తా

మిగిలిన పనులు చేసేందుకు గత ప్రభుత్వం గత ఏడాది నవంబరులో కాంట్రాక్టరుకు పనులు అప్పగించింది. ఏ పద్దు కింద బిల్లులు చెల్లిస్తారో స్పష్టత లేనందున గుత్తేదారు పనులు ప్రారంభించేందుకు ఆసక్తి చూపలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక.. తాజాగా గత వారం పద్దును కేటాయించారు. అయితే బడ్జెట్ ఉందని అధికారులు హామీ ఇస్తేనే అగ్రిమెంట్ చేసేందుకు వస్తానని గుత్తేదారు చెప్పినట్లు సమాచారం. ప్రభుత్వం నుంచి అనుమతులు రావడం ఆలస్యం అవుతున్నందున దాతకు అనుమతిస్తే సర్వజనాసుపత్రి అధికారులు సూచించిన విధంగా పనులు ప్రారంభించొచ్చు. దీనివల్ల సమయం కలిసొస్తుంది. వివిధ విభాగాల అధికారుల్లో సమన్వయ లోపంతో ఈ ప్రాజెక్టు పనులు ముందుకు కదలకపోవడం గమనార్హం.

ప్రస్తుత పరిస్థితి: గ్రౌండ్, మొదటి, రెండో అంతస్తుల శ్లాబ్ పనులు పూర్తి. గ్రౌండ్, మొదటి అంతస్తుల్లో ఇటుక పనులు పాక్షికంగా పూర్తి. రెండో అంతస్తు నుంచి మూడో అంతస్తుకు కాలమ్స్ ఏర్పాటు. ఆ భవనం కింది అంతస్తులోని కొంత భాగంలో అవసరమైన మరమ్మతులు చేయించి కొత్తగా సీటీస్కాన్ యంత్రాన్ని బిగించారు.

అనుమతించింది:	13.10.2015
విలువ	రూ.10 కోట్లు
గుత్తేదారునికి పని అప్పగించింది	03-8-2017
పని విలువ	రూ.6,57,93,536
పూర్తి చేయాల్సిన సమయం	18 నెలలు

ప్రతిపాదించింది: ఐదంతస్తుల భవనం. ఇందులో ఎంఆర్‌డీ, సీఎస్ఎస్‌డీ, లాండ్రీ, కమర్షియల్ క్యాంటిన్, డైట్ క్యాంటిన్ వంటి వాటిని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.

కొత్తగా టెండర్లు.. సర్వీస్‌బ్లాక్‌లో నిలిచిపోయిన పనులను ప్రారంభించడానికి 2023, ఆగస్టు 17న టెండర్లు పిలిచారు. టెండర్ల పరిశీలన అనంతరం రూ.4.99 కోట్లతో పనులు చేసేందుకు హైదరాబాద్‌కు చెందిన గుత్తేదారుకు 2023, నవంబరు 28న అనుమతించారు. అయినప్పటికీ ఈ పనులు చేసేందుకు గుత్తేదారు ఇప్పటివరకు ముందుకు రావకపోవడం గమనార్హం.

రేట్లు పెరిగాయి..

గుత్తేదారు పాత రేట్లతోనే పనులు చేసేందుకు ఆసక్తిగా ఉన్నారు. బడ్జెట్ కేటాయింపులుంటే పనులు చేయగానే బిల్లులు చెల్లిస్తారని భావిస్తున్నారు. అలా కాకుండా ప్రస్తుతం తిరిగి టెండర్లు పిలిస్తే.. కొత్త ధరల ప్రకారం ఎక్కువగా ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. అందువల్ల అధికారులు త్వరితగతిన నిర్ణయం తీసకోవాల్సిన అవసరముంది.

వసతి గృహ నిర్మాణానికి రూ.50 లక్షల విరాళం



చెక్కును ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ చేతుల మీదుగా కోటేశ్వరరావుకు అందజేస్తున్న రామకృష్ణ ప్రసాద్

గుంటూరు(పట్టాభిపురం), న్యూస్‌టుడే: కమ్మజన సేవా సమితి ఆధ్వర్యంలో గుంటూరులో అత్యాధునిక వసతులతో నిర్మిస్తున్న విద్యార్థినుల వసతి గృహ నిర్మాణానికి ప్రవాసాంధ్రుడు, సమితి జీవితకాల ఛైర్మన్ నూతక్కి రామకృష్ణ ప్రసాద్ మరో రూ.50 లక్షల విరాళం అందజేశారు. దీనికి సంబంధించిన చెక్కును ఆయన మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ చేతుల మీదుగా సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావుకు శుక్రవారం కార్యాలయంలో ఇచ్చారు. దీంతో నూతన వసతి గృహ నిర్మాణానికి నూతక్కి రామకృష్ణ ప్రసాద్ ఇప్పటి వరకు రూ.9.75 కోట్లు అందజేసినట్లయింది. ఈసందర్భంగా రామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ '12 ఏళ్లుగా సమితి పాలకవర్గం గ్రామీణ ప్రాంత విద్యార్థినుల ఉన్నత చదువులకు తీసుకుంటున్న చర్యలు చూశాను. వారి నిబద్ధతను గుర్తించి రూ.25 కోట్లు సమకూరుస్తానని మాట ఇచ్చా. ఇందులో భాగంగా ఇప్పటి వరకు రూ.9.75 కోట్లు విరాళం అందజేశా'.. అని వివరించారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ దాతల సహకారం మరువలేనిదని, వారి నమ్మకాన్ని నూరు శాతం నిలబెట్టుకుంటామన్నారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు వడ్లమూడి నాగేంద్రం, కోశాధికారి గోరంట్ల పున్నయ్య చౌదరి, సంయుక్త కార్యదర్శి గుంటుపల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నాకాబందీ

90 వాహనాల జప్తు



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : నగరంలో శుక్రవారం పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాలతో పెద్దసంఖ్యలో పోలీసులు ఏకకాలంలో వివిధ కూడళ్లలో వాహన తనిఖీలు నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా, రిజిస్ట్రేషన్ పత్రాలు లేని, నంబర్ ప్లేట్ లేని, వాహనాలు నడిపిన మైనర్లు, ట్రిబుల్ రైడింగ్ చేస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. 90 వాహనాలను జప్తు చేశారు. నాకాబందీలో డీఎస్పీ సుబ్బారావు, సీఐలు సోమయ్య, సుబ్బారావు, నరసింహారావు, వీరాస్వామి, వీరేంద్రబాబు, నారాయణ, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు

ఆర్థిక ఇబ్బందులతో వ్యాపారి బలవన్మరణం

మేడికొండూరు, న్యూస్‌టుడే : ఆర్థిక ఇబ్బందులు కారణంగా వ్యాపారి బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పేరేచర్లకు చెందిన షేక్ బాజీ షరీఫ్(41)కు గ్రామంలో మెడికల్ దుకాణ నిర్వహణతోపాటు చిట్టీల వ్యాపారం చేస్తుంటారు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. తట్టుకోలేక మనోవేదనకు గురవుతున్నారు. శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరి వేసుకున్నారు. గమనించిన కుటుంబ సభ్యులు చూడగా అప్పటికే ఆయన మృతి చెందారు. ఆయనకు భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గుంటూరు సర్వజనాసుపత్రి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మానసిక వికాసానికి క్రీడలు దోహదం



ఆటల పోటీల విజేతలతో లెఫ్టినెంట్ కల్నల్ దీపక్‌కుమార్‌శర్మ తదితరులు

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: క్రీడలు శారీరక దారుఢ్యంతోపాటు మానసిక వికాసానికి దోహదపడతాయని ఏడీఎం అధికారి లెఫ్టినెంట్ కల్నల్ దీపక్‌కుమార్‌శర్మ అన్నారు. రింగురోడ్డులోని భాష్యం బ్లూమ్స్ సెకండరీ క్యాంపస్‌లో రెండురోజులపాటు నిర్వహించనున్న స్పోర్ట్స్ మీట్ ప్రారంభోత్సవానికి శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. స్పోర్ట్స్ మీట్, భాష్యం బ్లూమ్స్ జెండాలను ఆవిష్కరించి క్రీడాజ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభించారు. ఓపెన్ పరేడ్‌లో విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈసందర్భంగా దీపక్‌కుమార్ శర్మ మాట్లాడుతూ విద్యార్థులను దేశసమగ్రతను కాపాడే వారిలా తీర్చిదిద్దడంలో భాష్యం బ్లూమ్స్ కృషి అభినందనీయమన్నారు. మరో అతిథి గుంటూరు డీఎంహెచ్‌వో కార్యాలయ డీఎస్‌వో డాక్టర్ లక్ష్మనాయక్ మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్స్, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంటూ చదువుపై శ్రద్ధ వహించాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు క్రీడాపోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో భాష్యంబ్లూమ్స్ ప్రైమరీ, సెకండరీ క్యాంపస్ ప్రిన్సిపల్స్ కవిత, గిరిజారాణి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. కార్యక్రమాన్ని భాష్యంబ్లూమ్స్ జెడ్‌ఈవో వరలక్ష్మి పర్యవేక్షించారు.

లఘు చిత్ర పోటీల్లో జాతీయ స్థాయి బహుమతి



కేంద్ర పర్యాటకశాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ నుంచి బహుమతి అందుకుంటున్న ఎస్ఆర్ఎం విద్యార్థులు

తుళ్లూరు, న్యూస్‌టుడే : అంతర్జాతీయ విపత్తుల రిస్క్ తగ్గింపు దినోత్సవాన్ని పురస్కరించుకొని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం దిల్లీలో జరిగిన జాతీయ స్థాయి లఘు చిత్ర పోటీల్లో ఏపీ-ఎస్ఆర్ఎం సినీ కళాకారులైన విద్యార్థులు ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. ఈ వేడుకలు దిల్లీలోని డా. బీఆర్ అంబేడ్కర్ ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్‌లో ఎన్ఐడీఎం బృందం నిర్వహించింది. విజేతలకు నగదు బహుమతిని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ప్రదానం చేశారు. విజేతల్లో వర్సిటీ టీమ్ సినీమాట్స్ సభ్యులు షణ్ముఖ, శివ దుర్గేష్, సాంబశివరావులు ఉన్నారు. జాతీయ స్థాయి లఘు చిత్ర పోటీల్లో రాణించిన విద్యార్థులకు ఎస్ఆర్ఎం యాజమాన్యం అభినందనలు తెలిపింది.

దంపతులకు ఉపాధి కల్పిస్తే.. ఊడ్చేశారు!

అద్దంకి, న్యూస్‌టుడే: పెట్రోలు బంకు మేనేజర్లుగా పనిచేస్తున్న దంపతులిద్దరూ యజమానులకు తెలియకుండా అమ్మకం సొమ్ములు సొంతానికి వాడుకున్నారు. ప్రశ్నించినందుకు చంపేస్తామని బెదిరిస్తూ దాడికి యత్నించారు. ఈ సంఘటనపై అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. సీఐ పి.కృష్ణయ్య అందించిన సమాచారం మేరకు.. గుంటూరు పట్టణం దేవపురానికి చెందిన జెల్ది అనిల్‌కుమార్, గార్లపాటి రంజిత్‌కుమార్‌లు అద్దంకి ఎన్టీఆర్‌నగర్‌లో మూడేళ్ల క్రితం 'గార్లపాటి పెట్రోలియమ్స్' పేరుతో పెట్రోలు బంకు ప్రారంభించారు. పరిచయస్తుల సూచన మేరకు ప్రకాశం జిల్లా చీమకుర్తి అంబేడ్కర్ నగర్‌కు చెందిన బత్తుల వెంకటేశ్వర్లు, ఆయన భార్య మల్లీశ్వరిలను మేనేజర్లుగా నియమించుకున్నారు. నెలకు రూ.8 వేల చొప్పున జీతం ఇచ్చే విధంగా అంగీకరించారు. యజమానులిద్దరూ వృత్తి రీత్యా దక్షిణాఫ్రికాలో నివసిస్తున్నారు. ఏడాదికొక పర్యాయం అద్దంకి వచ్చి లెక్కలు చూసుకుని వెళుతున్నారు. రెండేళ్ల పాటు వ్యాపారం సాఫీగా సాగింది. వారం రోజుల క్రితం పెట్రోలు బంకు వద్దకు వచ్చిన యజమానులు నిర్ఘాంతపోయారు. మేనేజర్లుగా ఉన్న ఇద్దరు దంపతులు అందుబాటులో లేరు. నాలుగు నెలల నుంచి పెట్రోలు ఉత్పత్తుల అమ్మకాలకు సంబంధించిన డబ్బులు రూ.30 లక్షలు ఫోన్‌పే ద్వారా వారి ఖాతాకు జమ చేసుకున్నారు. వీటితో పాటు అనిల్‌కుమార్ ఇచ్చిన రూ.నాలుగు లక్షలు వెరసి రూ.34 లక్షలు వారి నుంచి రావాల్సి ఉంది. ఆమేరకు యజమానులు చీమకుర్తిలోని దంపతుల ఇంటికి వెళ్లి చూడగా రెండంతస్తుల భవనం, కారు, బైకు, మూడు చరవాణిలు ఉన్నట్లు గుర్తించారు. వారిని ప్రశ్నించగా పొంతన లేని సమాధానం చెప్పడంతో పాటు తమ ఇంటికి వస్తే చంపేస్తామంటూ బెదిరించి, దాడికి ప్రయత్నించారు. ఆమేరకు అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

సిమెంట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

కృష్ణనగర్(తాడేపల్లి), న్యూస్‌టుడే : తాడేపల్లి పరిధిలో లాకౌట్ ప్రకటించి మూసివేసిన కృష్ణనగర్ ఏసీసీ సిమెంట్ పరిశ్రమ భూముల ఆక్రమణకు ఈ నెల 27 కార్మికులంతా తరలిరావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శుక్రవారం సిమెంట్ పరిశ్రమ భూముల వద్ద కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఆయన మట్లాడుతూ కార్మికులకు సీపీఎం సంపూర్ణ మద్దతు ప్రటించినట్లు తెలిపారు. మంత్రి, మంగళగిరి శాసనసభ్యుడు నారా లోకేశ్ సిమెంట్ పరిశ్రమ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సీపీఎం మండల, పట్టణ కార్యదర్శులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, బూరగ వెంకటేశ్వర్లు, సీఐటీయూ పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, కార్మిక సంఘ నాయకులు కూరపాటి స్టీవెన్ తదితరులు పాల్గొన్నారు.

కరెంటు ఛార్జీల భారం తగ్గించుకోవచ్చు

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన కింద ఇంటి పైకప్పుపై సౌర ఫలకాలు ఏర్పాటు ద్వారా విద్యుత్తు ఉత్పత్తి చేసి బిల్లు భారం తగ్గించుకోవచ్చని గుంటూరు సర్కిల్ పర్యవేక్షక ఇంజినీరు కేవీఎల్ఎన్ మూర్తి సూచించారు. విద్యుత్తు భవన్‌లో శుక్రవారం ఉద్యోగులు, గుత్తేదారులతో నిర్వహించిన సమావేశంలో మూర్తి మాట్లాడుతూ లబ్ధిదారులపై భారం పడకుండా రాయితీగా అందించే సొమ్ముతో పాటు బ్యాంకు నుంచి రుణం ఇస్తారన్నారు. తమ వాటాగా కేవలం రూ.10 వేలు చెల్లిస్తే సౌర యూనిట్ ఏర్పాటవుతుందన్నారు. ఇప్పటివరకు 185 మంది ఈ పథకం కింద ప్రయోజనం పొందారన్నారు.